ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత శనివారం గరిష్ఠం : 37.0 కనిష్ఠం : 25.0
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
ఆదివారం 18 మే 2025

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

అనంతపురం, రాప్తాడు, శింగనమల	:9985411608
తాడిపత్రి,	: 7659062646,
గుంతకల్లు, ఉరవకొండ,	: 9985411657,
కళ్యాణదుర్గం,	:9701120019,
రాయదుర్గం,	: 9000406723,

ఏసీఎం: 9985411154




సైనికులకు బాసటగా నిలుద్దాం

- రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్
- అనంతలో భారీ తిరంగా ర్యాలీ

(వివరాలు 6వ పేజీలో..)



ప్రసంగిస్తున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

విద్యార్థులే భవిష్యత్తు నిర్మాతలు

సాంకేతిక సవాళ్లను అధిగమించాలి
గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్
అట్టహాసంగా జేఎన్టీయూ స్నాతకోత్సవం



బంగారు పతకాలు అందుకున్న ఆనందంలో విద్యార్థులు

6

నమో నారసింహా

- వైభవంగా లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం
- స్వామికి పట్టు వస్త్రాలను సమర్పించిన మంత్రి కేశవ్

ఉరవకొండ, మే 17(ఆంధ్రజ్యోతి): నమో నారసింహా నామస్మరణతో పెన్నహోబిలం అటవీ ప్రాంతమంతా మార్మోగింది. మండలంలో పెన్నహోబిలం బ్రహ్మోత్సవాలలో భాగంగా లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం శనివారం సాయంత్రం వైభవంగా జరిగింది. అశేష భక్తజనం నడుమ రథం ముందుకు కదిలింది. రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం స్వామికి సుప్రభాతసేవ, అర్చన, అలంకరణ, ఉత్సవ నిత్య హోమాలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చి రథంలో అధిష్ఠింపచేశారు. ఉదయం 11 గంటలకు మడుగుతేరును నిర్వహించారు. వేలాది మంది భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణమంతా భక్త జనసంద్రమైంది. భక్తులు అరటి, జామపండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. జిల్లా నుంచే కాకుండా కర్ణాటక నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు మహనంది, గౌస్, రాజు, ప్రవీణ్ అధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రమేష్‌బాబు, ప్రధాన అర్చకులు ద్వారకనాథాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వామిని దర్శించుకున్న మంత్రి కేశవ్

పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామిని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ శనివారం దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ ఈవో, అర్చకులు మంత్రికి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి స్వామి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఊరేగింపులో పాల్గొని మడుగుతేరును లాగారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయ్ భాస్కర్, మారెన్న, గుర్రం సుధాకర్, గోవిందు, తిప్పయ్య, మల్లికార్జున, నెట్టెం బోస్, వెంకటేశులు, చలపతి, నరేష్ పాల్గొన్నారు.



భక్తుల మధ్య సాగుతున్న రథం, పట్టువస్త్రాలు తీసుకువస్తున్న మంత్రి

వర్షాకాలంలా.. వాన..!



మడుగును తలపిస్తున్న రామ్‌నగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రాంతం

మండు వేసవిలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇది ఎండాకాలమా..? వానాకాలమా..? అనే సందేహం తలెత్తేలే వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. జిల్లాలో ఒక రోజు విరామం తరువాత వర్షం మళ్లీ దంచికొట్టింది. అనంతపురం, గుంతకల్లు, గుత్తి, పుట్లూరు, నార్పల, పెద్దవడుగూరు, గార్లదిన్నె తదితర మండలాల్లో శనివారం రాత్రి మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. శింగనమల, తాడిపత్రి మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం అర్బన్



అనంతపురం నడిమివంక- క్లాక్‌టవర్ మార్గంలో వర్షం



72 రోజుల్లో పూర్తి చేయడమే లక్ష్యం

- హంద్రీనీవా కాలువ వెడల్పుపై మంత్రి కేశవ్
- నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటా
- ఉరవకొండలో మినీ మహానాడు నిర్వహణ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి

ఉరవకొండ, మే 17(ఆంధ్రజ్యోతి): డెబ్బై రెండు రోజుల్లో హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు పూర్తి చేసి 12పంపులు ఆన్ చేయాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నామని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. పట్టణంలోని అనంతపురం బైపాస్‌లో నియోజకవర్గ మహానాడు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి కేశవ్ హాజరయ్యారు. తొలుత దివంగత ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముప్పై ఏళ్లుగా తనకు రాజకీయంగా అండగా నిలిచిన ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. నియోజకవర్గంలో ఫ్యాక్షన్‌ను నిర్మూలించామ న్నారు. అమరావతిలో ఉన్నా, నా మనసు ఉరవకొండ చుట్టూ తిరుగుతూనే ఉంటుందన్నారు. అధికారం ప్రజలకు ఉపయోగపడే ఆయుధం మాత్రమే అన్నారు. నియోజకవర్గంలోని అన్ని సామాజిక వర్గాల కమ్యూనిటీ భవనాలకు రూ.3కోట్లు నిధులు మంజూరు చేశామన్నారు. రూ.16కోట్లతో చేపట్టిన తాగునీటి పథకం పైపులైన్ పనులు పూర్తి కావచ్చినట్లు వెల్లడించారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా, సంక్షేమానికి, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలో శాశ్వతంగా కరువును పారద్రోలి, ప్రతి ఎకరాకు సాగు నీరు ఇవ్వాలన్న లక్ష్యంతో బనకచర్ల, పోలవరం ప్రాజెక్టులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. అమరావతిపై వైసీపీ దుష్ప్రచారం చేస్తుందని, దానిని తిప్పికొట్టాలని పిలుపినిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీధర్‌చౌదరి, ఎంపీపీ పెద్దన్న, మండల కన్వీనర్లు విజయ్‌భాస్కర్, నూతేటి వెంకటేష్, ప్రసాద్, మాజీ ఎంపీపీలు కుళ్లాయప్ప, బ్రహ్మయ్య ప్రతాప్‌నాయుడు, కొర్రా వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేపు రామగిరి ఎంపీపీ ఎన్నిక

- ఏర్పాట్లు సిద్ధం
- వైసీపీ ఎంపీటీసీల రాకపై అనుమానాలు



ఎంపీపీ ఎన్నిక నిర్వహణకు ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారి

రామగిరి, మే 17(ఆంధ్రజ్యోతి): రామగిరి ఎంపీపీ ఎన్నికకు అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. సోమవారం జరిగే ఎంపీపీ ఎన్నికకు వైసీపీ ఎంపీటీసీ సభ్యులు రావడం లేదని తెలుస్తోంది. రామగిరి మండలంలో 10 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. ఎంపీపీ మీనిగ నాగమ్మ మృతి చెందడంతో 9 మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. అందులో ఒకరు టీడీపీ సభ్యుడు కాగా, మరో ఇద్దరు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. ఎంపీపీ అభ్యర్థిగా అనుకున్న భారతి టీడీపీ నుంచి తిరిగి వైసీపీలోకి వెళ్లిపోయారు. ఎంపీపీ పదవి మహిళలకు కేటాయించారు. దీంతో ఎంపీపీ అభ్యర్థిగా తప్పని సరిగా మహిళ ఉండాలి. వైసీపీలో ఐదుగురు మహిళలు, ఒక పురుష ఎంపీటీసీ అభ్యర్థి ఉన్నారు. వైసీపీ ఎంపీటీసీలు ఎన్నికకు రావడం లేదని సమాచారం. ఒక వేళ సభ్యులను ఇక్కడికి తీసుకువస్తే వారిలో ఇద్దరు టీడీపీలోకి వస్తారని సమాచారం. గైర్హాజరైతే ఎంపీపీ పదవిని టీడీపీకి దక్కకుండా చేయవచ్చని వైసీపీ ఎత్తుగడగా తెలుస్తోంది. అధికారులు మాత్రం సోమవారం జరిగే ఎంపీపీ ఎన్నికకు ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. ఎన్నికల అధికారి సంజీవయ్య, సీఐ శ్రీధర్, ఎంపీడీఓ కమలాబాయితో ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు. ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా ఉండేలా పటిష్టబందోబస్తు చేపట్టారు.

22న జిల్లా మహానాడు

జయప్రదం చేయండి
టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

అనంతపురం అర్బన్, మే 17(ఆంధ్రజ్యోతి): నగరంలో ఈనెల 22న నిర్వహించే జిల్లా మహానాడును జయప్రదం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈనెల 22న ఉదయం 9.30 గంటలకు అనంతపురం నగరశివారులోని ఎంవైఆర్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా మహానాడు ప్రారంభమవుతుందన్నారు. ఈ వేడుకకు పార్టీ రాష్ట్ర నాయకులు, మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు హాజరవుతారని అన్నారు. జిల్లాలోని రాష్ట్ర, జిల్లా కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, కేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, మండల, పట్టణ, డివిజన్, వార్డు కమిటీ సభ్యులు హాజరు కావాలని ఆయన తెలిపారు.



మాట్లాడుతున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్





గోల్డ్ మెడల్, పీహెచ్‌డీ పొందిన వారి ప్రతిజ్ఞ



స్నాతకోత్సవానికి హాజరైన విద్యార్థులు, జనం

విద్యార్థులే భవిష్యత్తు నిర్మాతలు

సాంకేతిక సవాళ్లను అధిగమించాలి
గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్
అట్టహాసంగా జేఎన్టీయూ స్నాతకోత్సవం

అనంతపురం సెంట్రల్, మే 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులే భవిష్యత్ తరాల నిర్మాతలు అని గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ అన్నారు. జీరోను కనుగొన్న ఆర్య భట్టు నుంచి భౌతికశాస్త్ర నోబెల్ బహుమతి గెలుచుకున్న తొలి ఆసియావాసి సీవీ రామన్ వరకు భారతదేశం ఆవిష్కర్తల నిలయమని పేర్కొన్నారు. శనివారం జేఎన్టీయూఏలో 14వ స్నాతకోత్సవ వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. వర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ సుదర్శన రావు అధ్యక్షతన, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన స్నాతకోత్సవానికి యూనివర్సిటీ చాన్సలర్ హోదాలో గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో పాటు ముఖ్య అతిథిగా ఐఐటీ కాన్పూర్ విశ్రాంత ప్రొఫెసర్ ఎంఆర్ మాధవ్ హాజరయ్యారు. ముందుగా హైదరాబాద్ లారస్ ల్యాబ్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ సత్యనారాయణ చావాకు గవర్నర్ అబ్దుల్ నజీర్ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. తరువాత 41 మంది విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్, 40,109 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గవర్నర్ మాట్లాడుతూ.. వర్తమాన ఇంజనీర్లు, ఆవిష్కర్తలు, భవిష్యత్తు నిర్మాతలు, నాయకులు మీరేనని విద్యార్థులకు సూచించారు.

వ్యవస్థాపకులుగా రాణించేందుకు సొంత ప్రణాళికలు రూపొందించుకుని దేశానికి స్ఫూర్తిగా నిలవాలన్నారు. సమస్యలను గుర్తించి వాటి పరిష్కారాలను కనుగొనడం వ్యవస్థాపక లక్షణాలని తెలిపారు. ఈ అంశానికి దోహదపడేలా అమరావతి హబ్-అండ్ స్పోక్ మోడల్ అనుసంధానంగా జేఎన్టీయూలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కర్నూలు, కడప, చిత్తూరు, నెల్లూరు ఉమ్మడి జిల్లాల్లో ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, ఫార్మసీ విద్యలో అసాధారణమైన విద్యనందిస్తూ రాష్ట్రంలో జేఎన్టీయూ అగ్రశ్రేణిగా నిలిచిందని అన్నారు. శాస్త్ర, సాంకేతిక సవాళ్లను అధిగమించి, మానసిక సామర్థ్యాన్ని ప్రదర్శించాలన్నారు. మీ అభిరుచుల సాధనలో నిర్భయంగా ఉండాలని, ఏ వైఫల్యం మిమ్మల్ని నిరుత్సాహపరచనివ్వకూడదని హితవు పలికారు. విజయంతో సంతృప్తి చెందవద్దని, వినయంతో ముందుకు నడవాలని, జేఎన్టీయూ ఘనతను చాటాలని విద్యార్థులకు గవర్నర్ పిలుపునిచ్చారు.

విమర్శనాత్మకంగా ఆలోచించాలి
-ఐఐటీ కాన్పూర్ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎంఆర్ మాధవ్



జ్ఞానాన్ని పెంపొందించుకోవడమే విద్య ఉద్దేశంకాదని, విమర్శనాత్మకంగా ఆలోచించడం, నైతికంగా వ్యవహరించడం ముఖ్యమని ఐఐటీ కాన్పూర్ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎంఆర్ మాధవ్ పేర్కొన్నారు. తక్కువతో ఎక్కువ చేయగలమని ఏఐ, చాట్‌జీపీటి నిరూపిస్తున్నాయని వివరించారు. వంద మిలియన్ల వినియోగదారులను చేరుకోవడానికి మొబైల్ ఫోన్‌కు 30 సంవత్సరాలు పట్టిందన్నారు. చాట్‌జీపీటికి రెండు నెలలు మాత్రమే పట్టిందన్నారు. చాట్‌జీపీటిలో 20కి ఒకటో వంతు ఖర్చుతో డీప్‌సీక్‌ను చైనా తీసుకువచ్చిందని అన్నారు. తాను మొదటిసారి సివిల్ ఇంజనీర్‌గా పనిచేసే సమయంలో గృహనిర్మాణ ఖర్చులో 80శాతం మెటీరియల్ ఖర్చు, 20 శాతం ఇంటీరియర్ ఖర్చు అయ్యేదన్నారు. నేడు 20 శాతం నిర్మాణానికి, 80 శాతం ఇంటీరియర్‌కు ఖర్చుచేయాల్సి వస్తోందని అన్నారు. ముద్రించిన పుస్తకాన్ని చూడకుండానే ప్రసంగించారు.

గవర్నర్‌కు ఘన స్వాగతం



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి సవిత

అనంతపురం అర్బన్ మే 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు పలువురు ప్రముఖులు ఘనంగా స్వాగతం పలికారు. శనివారం జేఎన్టీయూ స్నాతకోత్సవానికి హాజరయ్యేందుకు జిల్లాకు వచ్చిన గవర్నర్‌ను స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత జ్ఞాపికను అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ప్రభుత్వ కార్యదర్శి హరిజవహర్‌లాల్, కలెక్టర్ వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివ నారాయణశర్మ పాల్గొన్నారు.



పూజిత కుమార్ రెడ్డికి పతకం బహుకరిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్



షేక్ షాజిద్ మురద్ | సబియా సుల్తానా | మొహ్మద్ అక్రమ్ | వెంకట కార్తీక్ | రమ్యలక్ష్మి | లక్ష్మిప్రియ | అఖిల | నాగమణి | భవిత



నాగేంద్రబాబు | హర్షిత | అభినయన | లికితరెడ్డి | వాల్మీకి హరిత | ఫాహిద్ అలి | వనతి | శ్రీవైష్ణవి | తయ్యూరు సుప్రజ | జాహ్నవి | సునీత | అమృత్‌బాబు



భవ్యశ్రీ | మహిత | గ్లిసియ | వాసంతి



పీహెచ్‌డీలు సాధించిన విద్యార్థులకు పట్టాల ప్రదానం

జేఎన్టీయూకు న్యాక్, ఎన్‌బీఏ ర్యాంకులు
వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సుదర్శనరావు



జేఎన్టీయూకు న్యాక్ ఏ గ్రేడ్‌ను, అన్ని పీజీ ప్రోగ్రామ్‌లకు ఎన్‌బీఏ అక్రిడిటేషన్ నాణ్యత, భద్రత, పర్యావరణం అంశాల్లో ఐఎస్‌ఓ సర్టిఫికేషన్లు పొందామని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సుదర్శనరావు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 801-1000, భారత దేశంలో 25వ స్థానం, రాష్ట్రంలో ప్రథమ స్థానంలో జేఎన్టీయూఏ నిలిచిందని పేర్కొన్నారు. క్యూఎస్ ఆసియా ర్యాంక్ 651-700, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంక్ 151-200 (ఇంజనీరింగ్), 51-100(స్టేట్ పబ్లిక్) ర్యాంకులు సాధించామని తెలిపారు. వివిధ ఏజెన్సీల నుంచి రూ.367 లక్షలకు పైగా ప్రాజెక్ట్ గ్రాంట్లను పొందామని అన్నారు. ఆవిష్కరణల ఫలితంగా ఈఈజీ ప్రాసెసర్లు, కాంక్రీట్ టెక్నాలజీలు, శక్తి పరికరాలను కవర్ చేసే పేటెంట్లు లభించాయన్నారు. తాజాగా 33 పేటెంట్లను అధ్యాపకులు ప్రచురించారని వివరించారు. డిగ్రీలో ఉపాధి సామర్థ్యాన్ని పెంపొందించడంలో నిబద్ధతకు గుర్తింపుగా మేకింగ్ ఇండియా ఎంప్లాయిబుల్ అవార్డు లభించిదని అన్నారు. కెమికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఎస్‌వీ సత్యనారాయణ, ఏఐసీటీఈ విశిష్ట నిపుణులుగా మూడు సంవత్సరాల పదవీకాలానికి గుర్తింపు పొందారన్నారు. అదేవిధంగా పలువురు ప్రొఫెసర్లకు అవార్డులు లభించాయన్నారు. ఈ సంవత్సరం 40,109 డిగ్రీలను ప్రదానం చేశామని, వీటిలో 30,017 మంది విద్యార్థులకు అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీలను, ఎంటెక్, ఎం ఫార్మసీ, ఎంసీఏ, ఎంబీఏ పూర్తిచేసిన 9,564 మంది విద్యార్థులకు పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీలు, 361 మందికి ఫార్మా-డి పట్టాలు, 167 మందికి పీహెచ్‌డీలను ప్రదానం చేశామని తెలిపారు. మెరుగైన ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు 41 బంగారు పథకాలను ప్రదానం చేశామన్నారు. వీటిలో 27 పథకాలను మహిళలు సాధించారని, ఇది నారీశక్తికి నిదర్శనమన్నారు. నాలుగు మెడల్స్‌ను పొందిన తయ్యూరు సుప్రజ, ఆరు మెడల్స్‌ను సాధించిన నంద్యాల పూజిల్‌కుమార్‌రెడ్డిని అభినందించారు.

విధుల్లో కలెక్టర్ బిజీబిజీ



గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పర్యటను విజయవంతం చేసేందుకు కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ మూడురోజుల నుంచి శ్రమిస్తూవచ్చారు. అధికార యంత్రాంగాన్ని అప్రమత్తంచేస్తూ గర్నర్ పర్యటన ఏర్పాట్లను పూర్తిచేయించారు. శనివారం ఉదయం రైల్వేస్టేషన్‌లో గవర్నర్‌కు స్వాగతం పలికి రోడ్లు, భవనాల అతిథిగృహానికి క్వాన్వాయ్‌తో వెళ్లారు. అక్కడి నుంచి గవర్నర్‌తోపాటే జేఎన్టీయూ స్నాతకోత్సవానికి వచ్చారు. కాన్వొకేషన్ ప్రారంభంకాగానే గవర్నర్ అబ్దుల్ నజీర్ వేదికను అలకరించారు. అనంతరం కలెక్టర్ తన ల్యాప్‌టాప్ ద్వారా ఈఆఫీస్ వంటి కార్యకలాపాల విధుల్లో నిమగ్నమయ్యారు.

పటిష్ట బందోబస్తు...

జేఎన్టీయూ స్నాతకోత్సవానికి హాజరైన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేశారు. గత రెండు స్నాతకోత్సవాలకు జిల్లాకు వచ్చిన సందర్భంకంటే ఈ సారి బందోబస్తు పెంచారు. దాదాపు 1.30 గంటల సేపు గవర్నర్ స్నాతకోత్సవంలో పాల్గొన్నారు. నిమిషం ఆలస్యం చేయకుండా ప్రణాళికబద్ధంగా కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించారు.

'పట్ట'రాని సంబరం...!



జేఎన్టీయూ స్నాతకోత్సవంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఎన్టీఆర్ ఆడిటోరియం సంబరాలతో మునిగిపోయింది. సంవత్సరాల తరబడి చదివిన ఫలితంగా గవర్నర్ అబ్దుల్ నజీర్, వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు చేతుల మీదుగా పట్టాలను అందుకున్న వేళ ఆనందంతో పులకించిపోయింది. డిగ్రీలను చేతబట్టుకుని వెళ్లేందుకు వివిధ ప్రాంతాల నుంచి కుటుంబ సభ్యులతో తరలివచ్చారు. మెడల్స్‌ను సాధించిన విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి బంగారు పతకాలను ముద్దాడుతూ మురిసిపోయారు. ప్రతిభకు తగిన గౌరవాన్ని ఇచ్చిన జేఎన్టీయూ.. జీవితకాలం స్థిరంగా నిలిపోయే అనుభూతిని ప్రసాదించిందని ఆనందాలను పంచుకున్నారు.



ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీ



మేము సైతం...



సైనికులకు బాసటగా
నిలుద్దాం

- రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్
- పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పాం
- రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్
- అనంతలో భారీ తిరంగా ర్యాలీ

ఆర్ట్స్ కళాశాల మైదానంలో మాట్లాడుతున్న మంత్రి కేశవ్



జాతీయ జెండాలతో భారీర్యాలీ →





అనంతపురం అర్బన్, మే 17(ఆంధ్రజ్యోతి): సైనికుల శక్తి సామర్థ్యాలకు బాసటగా నిలుద్దామని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయోత్సవాన్ని పురస్కరించుకొని త్రివిధ దళాల సైనికులకు సంఘీభావంగా అనంతపురం నగరంలో భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. శనివారం ఉదయం స్థానిక ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఉన్న మైదానం నుంచి క్లాక్ టవర్ మీదుగా సప్తగిరి సర్కిల్ సమీపంలోని జెండా స్తంభం వరకు ర్యాలీ నిర్వహించారు. పార్టీలకు అతీతంగా ప్రజా సంఘాల నాయకులు, మాజీ సైనికులు, విద్యార్థులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు, డాక్టర్లు, లాయర్లు, ప్రొఫెసర్లు, టీచర్లు, ఉద్యోగులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున ర్యాలీలో భాగస్వాములయ్యారు. ర్యాలీ పొడవునా జాతీయ జెండాలు రెపరెపలాడాయి. సప్తగిరి సర్కిల్ సమీపంలో జాతీయ జెండా స్తంభం వద్ద జాతీయ గీతాలాపన చేసి ర్యాలీని ముగించారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్, జాయింట్ కలెక్టర్ శివ నారాయణశర్మ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, పల్లె సింధూరరెడ్డి, బండారు శ్రావణిశ్రీ, ఎంఎస్ రాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంటకశివుడు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, అహుడా చైర్మన్ టీసీ వరుణ్, ఇతర ప్రజాప్రతినిధులు తిరంగ ర్యాలీలో పాల్గొన్నారు. జాతీయ జెండాను చేతపట్టుకొని భారత్ మాతాకీ జై అంటూ పెద్ద ఎత్తున నినదించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కేశవనాయుడు, జిల్లా సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప, డీవీఈఓ వెంకటరమణానాయక్, డీఈఓ ప్రసాద్‌బాబు, డీఎంహెచ్ఓ దేవి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు సరిపూటి సూర్యనారాయణ, ఎద్దులపల్లి సుబ్రహ్మణ్యం, బాంబే డయింగ్ నాగన్న, రాయల్ మురళీ, సింగవరం రవి, గంగారామ్, తలారి ఆదినారాయణ, దండు శ్రీనివాసులు, తెలుగు మహిళలు స్వప్న, సంగా తేజస్విని, చరిత తదితరులు పాల్గొన్నారు.

తిరంగా ర్యాలీ గర్వకారణం

దేశ సరిహద్దుల్లో ప్రాణాలను అడ్డేసి నిలిచిన సైనికులకు, సైనిక శక్తి సామర్థ్యాలకు బాసటగా నిలుస్తూ దేశం మొత్తం తిరంగ ర్యాలీ జరుపుకోవడం గర్వకారణం. దేశం ఒక్కటే అన్న విషయం మన గుండెచప్పుడని ఈ రోజు అర్థం అవుతోంది. ఇంత ఉదయాన్నే వేలాది మంది ర్యాలీకి హాజరయ్యారంటే దేశభక్తి ప్రతి ఒక్కరి గుండె చప్పుడుగా మారిందనేందుకు ఇదే నిదర్శనం. గోరంట్ల మండలానికి చెందిన వీరజవాన్ మురళీనాయక్ యుద్ధంలో ప్రాణాలు అర్పించారు. సైనికులకు బాసటగా నిలవాల్సిన అవసరం ఉంది. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో తిరంగ ర్యాలీలో మనం అందరం భాగస్వామ్యులం కావడం గర్వించదగ్గ విషయం.

- పయ్యావుల కేశవ్, ఆర్థికశాఖ మంత్రి

సిందూర్‌తో పాకిస్థాన్‌కు సమాధానం



పహల్గాం ఉగ్రదాడిలో అమాయకులైన పర్యాటకులపై పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు 26 మందిని పొట్టనబెట్టుకున్నారు. ఈ ఘటనతో దేశమంతా బరువెక్కింది. ప్రతి భారతీయుడి కళ్లు ఎరుపెక్కాయి. మనందరి మనోభావాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా మన సైన్యం, ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్‌కు గట్టిగా సమాధానం చెప్పారు. మనదేశంలో అమాయకులపై దొంగ చాటుగా దెబ్బతిస్తే.. మనం ముందుగానే చెప్పి ఉగ్రవాద శిబిరాలను నేలమట్టం చేశాం. మురళీ నాయక్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోతే మనమంతా అంత్యక్రియల్లో పాల్గొని ఘనంగా నివాళులు అర్పించామన్నారు.

- సత్యకుమార్ యాదవ్, వైద్యఆరోగ్య శాఖ మంత్రి

మనమంతా అండగా ఉన్నాం



ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో భారత ప్రభుత్వం ఆదేశాల మేరకు సైనికులకు మద్దతుగా తిరంగా ర్యాలీని చేపట్టాం. నగర ప్రజలు, మహిళలు, యువత, ఎన్జీవోలు, సామాజిక సంస్థలు, విద్యావేత్తలు, డాక్టర్లు, లాయర్లు, ప్రొఫెసర్లు, వ్యాపార సంస్థలు, టీచర్లు, అన్ని వర్గాలు స్వచ్ఛందంగా తిరంగా ర్యాలీలో భాగస్వామ్యులు కావడం గర్వకారణం. ఈ ర్యాలీలో పాల్గొనడం ద్వారా సైనికులకు మనమంతా అండగా ఉన్నామని తెలియజేశాం.

- వినోద్‌కుమార్, కలెక్టర్

పాకిస్థాన్‌కు దీటుగా సమాధానం



పహల్గాం దాడిని నిరసిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్ ఉగ్రవాదులకు మన సైన్యం దీటుగా సమాధానం చెప్పింది. భవిష్యత్‌లో ప్రపంచ పటంలో మీ పేరు కూడా లేకుండా చేస్తామనే రీతిలో మన సైన్యం పాకిస్థాన్‌కు సమాధానం చెప్పింది. భారతదేశ ఔన్నత్యాన్ని కాపాడేందుకు ఎంతటి త్యాగానికైనా సిద్ధంగా ఉన్నామని ప్రపంచ దేశాలకు తెలియజేశారు.

- లక్ష్మీనారాయణ, ఎంపీ

మనసైన్యం సత్తా చాటింది



పహల్గాం తరహాదాడులు పునరావృతమైతే ఆపేరేషన్ సిందూర్ లాంటివి కూడా పునరావృతమవుతాయని మన సైన్యం చేతల్లో చూపించింది. దేశ ప్రజల తరఫున సైన్యానికి సెల్యూట్ చేస్తున్నాం. ఆపరేషన్ సిందూర్‌తో మన ఆర్మీ శక్తి ఏంటో ప్రపంచానికి తెలిసింది. పాకిస్థాన్ పౌరులకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా ఉగ్రవాదులే లక్ష్యంగా మన సైన్యం దాడులు చేసింది.

- దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఎమ్మెల్యే

పట్టపగలే ఇంట్లో చోరీ


బీరువాలో ఉన్న బంగారు నగలు ఎత్తుకెళ్లిన దుండగులు

గుంతకల్లు టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జగ్జీవన్ రామ్ కాలనీలో నివాసమంటున్న చెరుకు బండి ఫక్రుద్దీన్ ఇంట్లో శనివారం మధ్యాహ్నం ఇంట్లో చోరీ జరిగింది. వివరాల మేరకు.. ఫక్రుద్దీన్ ఉదయం చెరకు బండి పనికి వెళ్లాడు. అతడి భార్య బషీరున్నీసా చర్చి స్కూల్‌లో పనికి వెళ్లింది. వారి ఇద్దరు కుమారులు కూడా పనికి వెళ్లారు. పిల్లవాడికి ప్రభుత్వ ఆసుపత్రిలో టీకాలు వేయించేందుకు కోడలు, కూతురు ఇంటికి తాళం వేసి.. కిటికీ వద్ద ఉన్న డబ్బా కింద తాళం చెవులు పెట్టి వెళ్లారు. ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చే సరికి ఇంటి తలుపులు తెరచి ఉన్నాయి. దుండగులు బీరువాలో ఉన్న ఎనిమిదిన్నర తులాల బంగారు నగలు, ఆరు తులాల వెండి వస్తువులు ఎత్తుకెళ్లారన్నారు. తన మనవడి నామకరణం ఫంక్షన్ కోసం తన కుమార్తె కదిరి నుంచి ఈనెల 13న వచ్చిందన్నారు. తన కూతురు బీరువాలో పెట్టిన ఎనిమిదిన్నర తులాల బంగారు నగలను దుండగులు ఎత్తుకెళ్లారని ఫక్రుద్దీన్ వాపోయాడు. రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఫక్రుద్దీన్ తెలిపాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

వడదెబ్బతో టీడీపీ కార్యకర్త మృతి


శ్రీనివాసులు (ఫైల్)

బెళుగుప్ప, మే 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన టీడీపీ కార్యకర్త వీరాపురం శ్రీనివాసులు(42) శనివారం వడదెబ్బతో మృతి చెందాడు. తీవ్ర అస్వస్థతతో ఉన్న ఆయన్ను కళ్యాణదుర్గం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య రాధికా, కూతుర్లు లావణ్య, వెన్నెల సంతానం గలదు.

లారీ దగ్ధం.. రూ. 4 లక్షల నష్టం


దగ్ధమవుతున్న లారీ

గార్లదిన్నె, మే 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు వద్ద 44వ జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం ఓ లారీ దగ్ధమయ్యింది. వివరాల మేరకు.. తమిళనాడుకు చెందిన లారీ నెల్లూరు జిల్లా కృష్ణపట్నం నుంచి శుక్రవారం రాత్రి 8 గంటలకు సన్‌ఫ్లవర్ అయిల్ లోడుతో బయలుదేరి శనివారం ఉదయం 8 గంటలకు అనంతపురంలో అన్‌లోడు చేసింది. అనంతరం కర్ణాటకలోని రాయచూరుకు బయలుదేరింది. కల్లూరు బైపాస్ వద్దకు రాగానే క్యాబిన్‌లో మంటలు వ్యాపించాయి. గమనించిన డ్రైవర్ రఘుపతి లారీని పక్కకు అపి కిందకు దిగి మంటలను ఆదుపు చేసేందుకు ప్రయత్నించాడు. మంటలు పెద్దఎత్తున చెలరేగాయి. స్థానికులు పోలీసులకు, అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారు. పోలీసు, అగ్నిమాపక శాఖ సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. లారీలో మంటలను ఆదుపు చేశారు. లారీ క్యాబిన్ కాలిపోవడంతో సుమారు రూ. 4 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లిందని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. లారీ డ్రైవర్ రఘుపతిని పోలీసులు విచారిస్తున్నారు.

ఘనంగా ఓబయ్య జయంతి


ఓబయ్య చిత్రపటానికి పూలమాలలు వేసిన దృశ్యం

కుందుర్పి, మే 17(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు ఇండియా ఓబయ్య 109వ జయంతిని శనివారం మండలకేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు ఓబయ్య గురించి పలు విషయాలు వివరించారు. ఉపాధ్యాయుడిగా మొదలుపెట్టి ఎమ్మెల్యే స్థాయికి ఎదిగిన ఓబయ్య జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. స్వతంత్ర్య ఉద్యమంలో భాగంగా బళ్లారిలో జైలు శిక్ష అనుభవించారన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ శాస్త్రి, అపిలేపల్లి సర్పంచ్ హసీనా అతావుల్లా, కుందుర్పి సర్పంచ్ మారుతేశ్వర్ రామ్మూర్తి, మహంతపురం సర్పంచ్ జగన్, జిన్నా ఓబులేష్, కుందుర్పయ్య, శీల మంజునాథ, మహంతపురం వీరన్న, లచ్చన్న పాల్గొన్నారు.

రేపు వాల్మీకి ప్రతిభా పురస్కారాలు

అనంతపురం విద్య, మే 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వాల్మీకి, బోయ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు 2024-25 విద్యా ఏడాదికి సంబంధించి ప్రతిభా పురస్కారాలు అందించనున్నట్లు వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అక్కులప్ప, ప్రధాన కార్యదర్శి చైతన్యకుమార్, కోశాధికారి పవన్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు రుద్రంపేట బైపాస్‌లోని వాల్మీకి కల్యాణ మండపంలో ఈ నెల19న ప్రతిభా పురస్కారాలు అందిస్తామన్నారు. వివరాలకు 9440774519, 8309090406 నెంబర్లను సంప్రదించాలన్నారు.

అప్పుల బాధతో నిరుద్యోగి ఆత్మహత్య


రాముసాయక్ (ఫైల్)

తనకల్లు, మే 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏనుగుగుండు తండాకు చెందిన రామునాయక్ (33) అనే వికలాంగ నిరుద్యోగి శనివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ గోపి తెలిపిన వివరాల మేరకు.. బీఈడీ చదివిన రామునాయక్ కుటుంబ అవసరాలు, చదువుకోసం రూ.2 లక్షలు అప్పులు చేశాడు. డీఎస్సీ కోసం సిద్ధమవుతున్నాడు. ఇంతలో అప్పులవారు ఒత్తిడి చేయడంతో ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి రామలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణాలు తీసిన భూ వివాదం

రాప్తాడులో దంపతుల హత్య

పొలంలో వేట కొడవళ్లతో దాడి

ఇరువర్గాలకు చెందిన పలువురికి గాయాలు


ముత్యాలమ్మ, నారాయణరెడ్డి (ఫైల్), సంఘటనా స్థలంలో కొడవలి, వివరాలు ఆరా తీస్తున్న డీఎస్పీ

రాప్తాడు, మే 17(ఆంధ్రజ్యోతి): దాయాదుల మధ్య కొన్నేళ్ల నుంచి కొనసాగుతున్న భూ వివాదం ఇద్దరి హత్యకు దారి తీసింది. భూమి కోసం ఇరువర్గాలు ఘర్షణకు దిగడంతో రాప్తాడుకు చెందిన చిగిచెర్ల ముత్యాలమ్మ(46), చిగిచెర్ల నారాయణరెడ్డి(56) దంపతులు ప్రాణాలు కోల్పోయారు. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు, రాప్తాడు సీఐ శ్రీహర్ష, రాప్తాడు తహసీల్దారు విజయకుమారి తెలిపిన మేరకు, రాప్తాడుకు చెందిన చిగిచెర్ల నారాయణరెడ్డికి గంగలకుంట రెవెన్యూ పొలంలోని సర్వే నంబర్ 78-3లో (పాత సర్వే నెంబర్) 6.20 ఎకరాల భూమి ఉండేది. దీన్ని 1997లో రాప్తాడుకు చెందిన కాటమిరెడ్డి ముగ్గురు కూతుళ్లు పుల్లమ్మ, వెంకటలక్ష్మి, నాగలక్ష్మికి ఎకరం రూ.15 వేలకు విక్రయించారు. కొనుగోలుదారులు రూ.93 వేలు చెల్లించి అగ్రిమెంట్ చేసుకున్నారు. రిజిస్ట్రేషన్‌కు రమ్మంటే పలు కారణాలు చూపుతూ నారాయణరెడ్డి కాలయాపన చేశారు. దీంతో భూమి కొన్నవారు అప్పట్లో కోర్టును ఆశ్రయించారు. కొన్నేళ్లపాటు కోర్టులో విచారణ జరిగిన తరువాత 2012లో అనంతపురం సివిల్ కోర్టు ఆ భూమి కొన్నవారికే చెందుతుందని తీర్పునిచ్చింది. కోర్టు ఆదేశాలతో కొన్నవారి పేరిట రిజిస్ట్రేషన్ అయింది. అయినా నారాయణరెడ్డే ఆ భూమిని సాగు చేసుకుంటున్నారు. దీంతో భూమిని కొన్నవారు హైకోర్టును ఆశ్రయించారు. 2022లో హైకోర్టు కూడా ఆ భూమి కొన్నవారికే చెందుతుందని తీర్పునిచ్చింది. కోర్టు ఆదేశాల మేరకు ఈ ఏడాది జనవరి 7న రెవెన్యూ అధికారులు కొనుగోలుదారుల పేరిట భూమిని ఆన్‌లైన్ చేయించారు. ఆర్డీఓ ఆదేశాలతో భూమిని కొనుగోలుదారుల పేరిట ఆన్‌లైన్‌లో ఎక్కించామని తహసీల్దార్ తెలిపారు. ఈ క్రమంలో రాప్తాడు, చుట్టు పక్కల గ్రామాలకు చెందిన కొందరు ఆ భూమిని పుల్లమ్మ, వెంకటలక్ష్మి, నాగలక్ష్మి నుంచి ఎకరం రూ.60 లక్షల ప్రకారం కొన్నట్లు అగ్రిమెంటు చేసుకున్నారు. పుల్లమ్మ, వెంకటలక్ష్మి, నాగలక్ష్మి, వారి కుటుంబ సభ్యులు, వారి నుంచి భూమిని కొన్నట్లు అగ్రిమెంట్ రాసుకున్న వారు శనివారం ఉదయం పొలానికి వెళ్లారు. ఎక్స్‌కవేటర్‌తో పొలంలోని దానిమ్మ చెట్లను తొలగిస్తుండగా.. నారాయణరెడ్డి, ఆయన భార్య ముత్యాలమ్మ, కుమారుడు ప్రదీప్ కుమార్ రెడ్డి, బావమరిది ప్రతాప్ రెడ్డి పొలానికి వెళ్లారు. అక్కడ ఇరువర్గాలకు ఘర్షణ జరిగింది. వేట కొడవళ్లతో దాడి చేయడంతో ముత్యాలమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన నారాయణరెడ్డి అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. గాయపడిన ప్రతాప్‌రెడ్డి చికిత్స పొందుతున్నాడు. మరో వర్గానికి చెందిన పుల్లమ్మ, నాగలక్ష్మి, బాలనరసింహారెడ్డి, రాప్తాడుకు చెందిన పామళ్ల కొండప్ప గాయపడి, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న రూరల్ డీఎస్పీ వెంకటేశులు, రాప్తాడు సీఐ శ్రీహర్ష సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. హత్యకు వాడిన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిపై నారాయణరెడ్డి కుమారుడు ప్రదీప్ కుమార్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ హత్యలను ప్రత్యక్షంగా, పరోక్షంగా మరికొందరు ప్రోత్సహించారని ప్రదీప్ కుమార్ రెడ్డి ఆరోపించారు.

11 మందిపై కేసు

దంపతుల హత్య కేసులో పదకొండు మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ధనుంజయ, కత్తుల పండయ్య, గోనిపట్ల శీనా, ఇంద్రశేఖర్, కొండప్ప, జగదీష్, గంగలకుంట దుబ్బ లక్ష్మీనారాయణ, దండు నరేంద్ర, నిరంజన్‌రెడ్డి, బాలనరసింహారెడ్డి, ధర్మారెడ్డిని నిందితులుగా చేర్చారు. వారికోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైతు ఇంట విషాద చాయలు

ముత్యాలమ్మ, నారాయణరెడ్డి దంపతులకు ఇద్దరు కుమారులు. భూ తగాదాలో దంపతులు మృతి చెందడంతో ఆ ఇంట్లో విషాదం నెకొంది. వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్న కుటుంబంలో పెద్దలు మరణించడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. రాప్తాడులో ఆదివారం అంత్యక్రియలు నిర్వహిస్తారని తెలిసింది.

వికటించిన వసూళ్లు..!

- ఆఫీస్‌బాయ్‌పై సీఐ ఒత్తిడి?
- భరించలేక ఎక్సైజ్ సంఘం అధికారుల దృష్టికి విషయం
- విచారణలో ఆఫీస్‌బాయ్‌పై చెప్పుతో దాడి
- కళ్యాణదుర్గం ఎక్సైజ్ సీఐ తీరుపై ప్రజాసంఘాల ఆగ్రహం
- మామూళ్లు ఇస్తే చాలు మందు ఏదైనా అమ్ముకోచ్చా..?
- కర్ణాటక మద్యం పట్టుబడితే పండగేనని ప్రచారం



అధికారిని నిలదీస్తున్న ప్రజా సంఘాల నాయకులు


బాయ్‌ని చెప్పుతో కొడుతున్న ఎక్సైజ్ సీఐ హసీనాబాను

కళ్యాణదుర్గం, మే 17(ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం ఎక్సైజ్ శాఖలో జరుగుతున్న అవినీతి తతంగం సీఐ తీరుతో బట్టబయలైంది. అక్రమ మద్యాన్ని అరికట్టాల్సిన అధికారే ఆఫీస్‌బాయ్‌ను మధ్యవర్తిగా పెట్టుకుని అవినీతికి పాల్పడుతుండటంపై తీవ్ర విమర్శలు వినవస్తున్నాయి. నియోజకవర్గం పరిధిలో సుమారు వంద గ్రామాల్లో కర్ణాటక మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. తనిఖీల్లో కర్ణాటక మద్యం, టెట్రా ప్యాకెట్లు దొరికితే స్థాయిని బట్టి రూ. 5 వేలు మొదలు రూ. లక్షల దాకా ఆ సీఐ వసూలు చేస్తున్నట్లు తెలిసింది. అక్రమ మద్యం దొరికితే కేసులు పెట్టకుండా డబ్బులు పుచ్చుకుని పంపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అక్రమ మద్యం విక్రయిస్తున్న వారి నుంచి అధిక మొత్తంలో వసూలు చేయాలని ఆఫీస్ బాయ్‌పై ఆమె ఒత్తిడి చేసినట్లు తెలిసింది. దీన్ని భరించలేని ఆ ఆఫీస్ బాయ్ ఎక్సైజ్ ఉద్యోగుల సంఘానికి ఫిర్యాదు చేశాడు. ఎక్సైజ్ ఉద్యోగుల సంఘం నాయకులు కళ్యాణదుర్గం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి విచారించారు. తనపైనే ఫిర్యాదు చేస్తావా అంటూ సీఐ ఆ సమయంలో సహనం కోల్పోయి చెప్పు తీసుకుని నానిని కొట్టారు. ఈ సంఘటన మూడు రోజుల క్రితం కళ్యాణదుర్గం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లోనే జరిగింది. అయితే శుక్రవారం రాత్రి వీడియో వైరల్ అయింది. ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి, అసిస్టెంట్ సూపరిండెంట్ రేవతి ఈ వీడియోపై పూర్తి స్థాయిలో శనివారం విచారణ చేపట్టారు. ఉన్నతాధికారులకు విచారణ నివేదికలను అందచేస్తామని తెలిపారు. ఆఫీస్ బాయ్‌కి మద్దతుగా ప్రజా సంఘాల నాయకులు, కుల సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. ఉన్నతాధికారుల అండదండలు ఆ సీఐకు ఉండటంతో ఏమి చేయలేకపోతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ స్టేషన్‌లో పని చేసేందుకు సిబ్బంది కూడా భయపడిపోతున్నట్లు సమాచారం. అందరూ సామూహిక సెలవులో వెళ్లాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది.

ఎక్సైజ్ సీఐపై ప్రజా సంఘాలు ఆగ్రహం

- స్టేషన్ ఎదుట బైఠాయించి...వ్యతిరేకంగా నినాదాలు

కళ్యాణదుర్గం రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ స్టేషన్‌లో ఆఫీస్ బాయ్‌గా పనిచేస్తున్న నానిని ఎక్సైజ్ సీఐ హసీనాబాను చెప్పుతో కొట్టడంపై తీవ్ర దుమారం రేగింది. స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఎదుట నాని కుటుంబ సభ్యులతో కలిసి నాయీ బ్రహ్మణ కుల సంఘాల నాయకులు, సీపీఐ, సీపీఎం, విద్యార్థి సంఘాల నాయకులు శనివారం ఆందోళనకు దిగారు. స్టేషన్ ఎదుట బైఠాయించి అవినీతి సీఐను సస్పెండ్ చేయాలంటూ నినాదాలు చేశారు. అవినీతి అధికారిపై విచారణ చేపట్టేందుకు వచ్చిన ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రేవతిలను ప్రజా సంఘాల నాయకులు నిలదీశారు. సీఐ అవినీతితో ఇక్కడ పనిచేసే అధికారులు విసుగెత్తుతున్నారని, ముడుపుల కోసం ఆమె ఒత్తిడులు తట్టుకోలేక గతంలో పనిచేస్తున్న ఓ ఎస్ఐ, మరో ముగ్గురు సిబ్బంది బదిలీపై వెళ్లారని వివరించారు. ప్రతి నెలా మామూళ్ల మత్తులో మునిగితేలుతూ, కర్ణాటక మద్యాన్ని తె ప్పించి వ్యాపారం చేయిస్తోందని ఆరోపించారు. ప్రతి మద్యం షాపు నుంచి ప్రతి నె లా ముడుపులు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఆమెకు అక్రమ మద్యం పట్టుబడి తే పండగే అని తోటి సిబ్బందే బాహాటంగా చెబుతుంటారని పేర్కొన్నారు. అవినీతి ఆ రోపణలు ఎదుర్కొంటున్న ఎక్సైజ్ సీఐపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చే శారు. ఆందోళనలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్, సీపీఎం జిల్లా కమిటీ స భ్యులు అచ్యుత్ ప్రసాద్, ప్రజా సంఘాల నాయకులు ఆర్కే రాజు, తిప్పేనాయక్ పాల్గొన్నారు.

నూతన క్రీడాపాలసీ వరం: శ్రీకాంత్

విజయవాడ(స్పోర్ట్స్), మే 17(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ప్రకటించిన నూతన క్రీడా పాలసీ వర్ధమాన క్రీడాకారులకు వరమని ఏపీ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి శ్రీకాంత్ అన్నారు. ఏపీ కబడ్డీ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక విజయ వాడ క్లబ్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ కార్యదర్శి శ్రీకాంత్ మట్లాడుతూ అసోసియేషన్ ఎకేఎఫ్ఐ గైడ్ లైన్స్ అనుగుణంగా పనిచేస్తుందని అన్నారు. తమ అసోసియేషన్‌కు ఎకేఎఫ్ఐ గుర్తింపు, సహకారం అందిస్తుందని, రాష్ట్రంలో నిబంధనల ప్రకారం మా అసోసియేషన్‌కి మాత్రమే గుర్తింపు, అర్హత ఉన్నాయని అన్నారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా చేస్తామని, ఖేలో ఇండియాలో మెడల్ కొట్టిన ప్రతి క్రీడాకారుడికి 5 వేలు బహుమతి అందిచడం జరిగిందని తెలిపారు. గతంలో కొంతమంది కబడ్డీ క్రీడా అసోసియేషన్ పేరుతో వివాదాలు చేశారని, ఇకపై అటువంటి వాటికి ఈ ప్రభుత్వంలో చోటులేదని, త్వరలోనే బీచ్ కబడ్డీ టోర్నమెంట్ నిర్వహిస్తామని తెలిపారు.

ప్రయాణికుల భద్రతే లక్ష్యం

- సౌత్ సెంట్రల్ రైల్వే ఐజీ అరోమాసింగ్ ఠాగూర్

ధర్మవరం, మే 17(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల భద్రతే తమ లక్ష్యమని సౌత్‌సెంట్రల్ రైల్వే ఐజీ అరోమాసింగ్ ఠాగూర్ అన్నారు. రైల్వే స్టేషన్‌లో ఉన్న ఆర్పీఎఫ్ కార్యాలయాన్ని శనివారం తనిఖీచేశారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. కేసులు, వాటి పరిష్కారాలను ఆర్పీఎఫ్ సీఐ నాగేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్పీఎఫ్ మహిళలకు ఏర్పాటు చేసిన విశ్రాంత భవనాన్ని ఆమె ప్రారంభించారు. ఆర్పీఎఫ్ విభాగంలో మహిళలకు గట్టి భద్రతలను ఇవ్వడమే రైల్వేశాఖ లక్ష్యం అన్నారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సుఖవంతంగా ప్రయాణం చేయడానికి ఆర్పీఎఫ్ అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. అనంతరం రైల్వే పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో గుంతకల్లు డివిజన్ కమిషనర్ మురళీక్రిష్ణ, అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ అనిల్‌కుమార్‌సింగ్, రేణిగుంట అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ రాజగోపాల్‌రెడ్డి, ధర్మవరం ఆర్పీఎఫ్ సీఐ నాగేశ్వరరావు, ఎస్ఐ రోహిత్‌గౌడ్ పాల్గొన్నారు.



లేపాక్షి శిల్పకళ అద్భుతం

లేపాక్షి: లేపాక్షి శిల్ప, చిత్రకళలు అద్భుతంగా ఉన్నాయని దక్షిణ మధ్య రైల్వే ఎస్సీఆర్ఐసీ ప్రిన్సిపల్ చీఫ్ సెక్రెటరీ కమిషనర్ అరోమాసింగ్ ఠాకూర్ అన్నారు. ఆలయాన్ని ఆమె శనివారం సందర్శించారు. ఆలయంలోని ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అర్ధంతరంగా ఆగిన కల్యాణ మండపం, సీతాదేవి పాదం, వేలాడే స్తంభం సందర్శించి సంతోషం వ్యక్తం చేశారు. ఆనాటి శిల్పుల నైపుణ్యాన్ని కొనియాడారు. అనంతరం దుర్గా వీరభద్రస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

◄ లేపాక్షి ఆలయంలో అరోమాసింగ్ ఠాకూర్, ఇతర అధికారులు

మానవతామూర్తి దరూరు పుల్లయ్య: రామకృష్ణ

అనంతపురం విద్య, మే 17(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ దరూరు పుల్లయ్య మానవతామూర్తి అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ కొనియాడారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం రాత్రి నిర్వహించిన సంతాప సభలో ఆయన పాల్గొన్నారు. పుల్లయ్య చిత్రపటానికి రామకృష్ణ, మానవహక్కుల వేదిక చంద్రశేఖర్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు జగదీశ్, రచయిత బండి నారాయణ స్వామి, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుడు దాదాగాంధీ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ... 1977లో అనంతపురం ఎంపీగా గెలిచిన తర్వాత దరూరు పుల్లయ్య ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేశారని అన్నారు. అప్పటి సీఎం వైఎస్సార్ దృష్టికి తీసుకువెళ్లి హంద్రీనీవా లిఫ్టులను తగ్గించేందుకు విశేషంగా కృషి చేశారని అన్నారు. ఆయన పేరిట ట్రస్టు ఏర్పాటుచేసి, పేదలకు సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, రాజారెడ్డి, నారాయణ స్వామి, రామకృష్ణ, నాగరాజు, రామాంజి, బాషా, అల్లిపీరా, కాటమయ్య పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న నాయకులు

3,815 మందికి బదిలీ తప్పదు..!

ఒకేచోట 5-8 ఏళ్లు పనిచేసిన టీచర్లు

మొత్తం ఖాళీలు 7,643

క్లియర్ వేకెన్సీలు 923

రీ అపోర్షన్ ఖాళీలు 2,875

ఈ ఖాళీలే దాదాపు ఫైనల్

అనంతపురం విద్య, మే 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,815 మంది ఉపాధ్యాయులు తప్పనిసరి బదిలీ అవ్వాల్సిన జాబితాలో ఉన్నారు. ఒకే స్థానంలో 5 నుంచి 8 ఏళ్లపాటు విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులు రెండు జిల్లాల్లో 3,815 మంది ఉన్నారని విద్యాశాఖ అధికారులు తేల్చారు. వీరంతా తప్పనిసరిగా బదిలీ అవుతారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఫైనల్‌గా 7,643 పోస్టులు ఖాళీలు ఉన్నట్లుగా ఉమ్మడి విద్యాశాఖ జిల్లా అధికారులు తేల్చారు. ఈ ఖాళీలు దాదాపుగా ఫైనల్ అయినట్లు తెలుస్తోంది. వీటిలో రీ అపోర్షన్ వేకెన్సీలుగా 2,875, క్లియర్ వేకెన్సీలు 923 ఉన్నట్లు గుర్తించారు. మరో 30 వరకూ ఎఫ్ఎస్‌టీసీ, స్టడీ లీవ్, అనధికార గైర్హాజరు తదితర ఖాళీలు ఉన్నాయి. బదిలీల్లో ప్రిఫరెన్షియల్ కేటగిరీ టీచర్లకు ఏకంగా 1,648 ఖాళీలు గుర్తించారు. ఇందులో 5 ఏళ్లు, 8 ఏళ్లు పూర్తయిన వారి కోసం 821 ఖాళీలు, క్లియర్ వేకెన్సీలు 209 కాగా, రీ -అపోర్షన్ వేకెన్సీల కింద 610 ఖాళీలు చూపించారు. మరో 8 ఖాళీలు ఇతర కేటగిరీల కింద చూపించారు. గత 10 రోజులుగా ఉమ్మడి జిల్లా విద్యాశాఖ అధికారులు, ఐటీ సెల్ సిబ్బంది, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, ఎమ్మార్సీ సిబ్బంది కరసత్తు చేసి ఈ ఖాళీలు గుర్తించారు.

హోదా	సబ్జెక్టు	మీడియం	ఖాళీలు
ప్రైమరీ హెచ్ఎం	–	–	712
గ్రేడ్-2 హెచ్ఎం	–	–	178
ఎస్జీటీ		తెలుగు	2884
ఎస్జీటీ		ఉర్దూ	114
ఎస్జీటీ		కన్నడ	16
ఎస్జీటీ-		ఇంగ్లీష్	348
ఎస్ఏ	గణితం	తెలుగు	391
ఎస్ఏ	గణితం	ఉర్దూ	23
ఎస్ఏ	గణితం	కన్నడ	02
ఎస్ఏ	గణితం	ఇంగ్లీష్	102
ఎస్ఏ	ఫిజికల్ సైన్స్	తెలుగు	367
ఎస్ఏ	ఫిజికల్ సైన్స్	ఉర్దూ	18
ఎస్ఏ	ఫిజికల్ సైన్స్	కన్నడ	04
ఎస్ఏ	ఫిజికల్ సైన్స్	ఇంగ్లీష్	90
ఎస్ఏ	బయాలజీ	తెలుగు	408
ఎస్ఏ	బయాలజీ	ఉర్దూ	20
ఎస్ఏ	బయాలజీ	కన్నడ	05
ఎస్ఏ	బయాలజీ	ఇంగ్లీష్	92
ఎస్ఏ	సోషల్	తెలుగు	291
ఎస్ఏ	సోషల్	ఉర్దూ	16
ఎస్ఏ	సోషల్	కన్నడ	02
ఎస్ఏ	సోషల్	ఇంగ్లీష్	83
ఎస్ఏ	ఫిజికల్ ఎడ్యుకేషన్	తెలుగు	254
ఎస్ఏ	ఫిజికల్ ఎడ్యుకేషన్	ఉర్దూ	4
ఎస్ఏ	ఫిజికల్ ఎడ్యుకేషన్	ఇంగ్లీష్	59
ఎస్ఏ	స్పెషల్ ఎడ్యుకేషన్	తెలుగు	21
ఎస్ఏ	స్పెషల్ ఎడ్యుకేషన్	ఇంగ్లీష్	02
ఎస్ఏ		తెలుగు	277
ఎస్ఏ		ఉర్దూ	20
ఎస్ఏ		హిందీ	247
ఎస్ఏ		కన్నడ	01
ఎస్ఏ		సంస్కృతి	06
ఎస్ఏ		ఇంగ్లీష్	586

చీనీ కాయలు టన్ను రూ.37వేలు

అనంతపురంరూరల్, మే17 (ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.37వేలు, కనిష్ఠంగా రూ.5వేలు, సరాసరి రూ.25వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 760టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

న్యూస్ బాక్స్

పల్లె ఇంటికి విద్యా మండలి చైర్మన్



చైర్మన్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

అనంతపురంరూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ మధుమూర్తి పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ఇంటికి వచ్చారు. శనివారం జేఎన్‌టీయూలో జరిగిన స్నాతకోత్సవ వేడుకలకు ఆయన హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం ఆలమూరు రోడ్డులోని ఎమ్మెల్యే నివాసానికి విచ్చేశారు. ఎమ్మెల్యే సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ పల్లె కిశోర్‌రెడ్డి ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి ఆహ్వానించారు. చైర్మన్ మాట్లాడుతూ మాజీ మంత్రితో తనకు ముందు నుంచి ఉన్నఅనుబంధాన్ని గుర్తు చేశారు. కేరళ మాజీ డీజీపీ శంకర్‌రెడ్డి, పీవీకేకే కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారావు, ఫార్మసీ ప్రిన్సిపాల్ శ్రీధర్ పాల్గొన్నారు.

సత్యనారాయణ చావాకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు



సత్యనారాయణ చావాకు బొకే ఇస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, మే 17(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ స్నాతకోత్సవంలో గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్న పారిశ్రామిక వేత్త, లారస్ ల్యాబ్స్ అధినేత డాక్టర్ సత్యనారాయణ చావాకు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం జేఎన్‌టీయూ ఆవరణలో ఆయనకు ఎమ్మెల్యే పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. లారస్ ల్యాబ్స్‌తోపాటు పారిశ్రామిక వేత్తగా సత్యనారాయణ చావా అనేక సేవలు అందించారని ఎమ్మెల్యే కొనియాడారు.

మురళీనాయక్ చరిత్రలో నిలిచిపోతాడు



అమరజవాన్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రజలు

శింగనమల, మే 17(ఆంధ్రజ్యోతి): అమర జవాన్, గిరిజన బిడ్డ మురళీనాయక్ చరిత్రలో నిలిచిపోతారని ఎంపీడీఓ భాస్కర్ అన్నారు. శనివారం మండలంలోని నాగులగుడ్డం తండాలో జవాను చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో సర్పంచ్, ఎంపీటీసీలు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయం



తూంచెర్లలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ యార్డ్ చైర్మన్

కనగానపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పించి అన్నివిధాల అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాప్తాడు మార్కెట్ యార్డ్ చైర్మన్ సుధాకర్ చౌదరి అన్నారు. తూంచెర్ల గ్రామంలో శనివారం నూతన సచివాలయంతో పాటు చెత్త సేకరణ కేంద్రంను ఆయన ప్రారంభించారు. ఎంపీడీఓ అనీల్‌కుమార్, తహసీల్దార్ ప్రసాద్, టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య, రాజాక్రిష్ణ, జయప్ప, మల్లికార్జున, చెన్నప్ప, ఆదెప్ప, బంగి మల్లేష్ పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి



పాటలతో అలరిస్తున్న కళాకారులు

అనంతపురం కల్చరల్, మే 17(ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ ఘంటసాల సాంస్కృతిక సేవా ట్రస్టు, ఎస్పీ బాలు మ్యూజిక్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం హౌసింగ్ బోర్డులోని రాజీవ్ చిల్డ్రన్స్‌పార్కులో నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. కళాకారులు ఘంటసాలతోపాటు ఎస్పీ బాలు పాటలను ఆలపిస్తూ వీనులవిందు చేశారు. గాయనీగాయకులు మహేష్‌స్వామి, రామకృష్ణ, బాలు, మాధవ, పాండురంగయ్య, శివ, శ్యామల, రిజ్వానా, శ్రీదేవి, బృంద. పద్మ, విజయలక్ష్మి, జీవీ రామయ్య, ఓబులదాస్, నాగరాజు, జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి, సుధాకర్‌బాబు పాల్గొన్నారు.

జనసేన వలంటీర్లకు కిట్లు అందజేత



వలంటీర్లకు కిట్లు అందజేస్తున్న టీసీ వరుణ్

అనంతపురం సెంట్రల్, మే 17(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న వలంటీర్లకు శనివారం ఆ పార్టీ అధ్యక్షుడు టీసీ వరుణ్ కిట్లను అందజేశారు. నాయకులు జయరాంరెడ్డి, ఈశ్వరయ్య, చంద్రశేఖర్, నాగేంద్ర, లక్ష్మీపతి, సంజీవరాయుడు, ధనుంజయ్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్డీటీ కోసం సంయమనంతో ముందుకెళ్తాం



మాంచో ఫెర్రర్‌కు జ్ఞాపికను అందిస్తున్న బీఎల్ఎఫ్ నాయకులు

అనంతపురం సెంట్రల్, మే 17(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ సేవలకు ఆటంకాలు తొలగించేందుకు సంయమనంతో ముందుకెళ్తామని ఆ సంస్థ చైర్మన్ మాంచో ఫెర్రర్ పేర్కొన్నట్లు బహుజన లాయర్స్ ఫోరం(బీఎల్ఎఫ్) అధ్యక్షుడు నారాయణప్ప తెలిపారు. శనివారం మాంచోను కలిసి ఎఫ్‌సీఆర్ఏ ప్రక్రియపై చర్చించినట్లు ఆయన తెలిపారు. సానుకూలంగా జరిగే విధానాలను అనుకరిస్తూ ఎఫ్‌సీఆర్ఏను రెన్యువల్ చేసుకోవాలని, న్యాయస్థానాల్లో దావాలు వేస్తే ప్రతిబంధకాలు సృష్టికోవడం ఇబ్బందిగా ఉంటుందని ఆయన తెలిపారన్నారు. అనంతరం మాంచోకు జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మహేశ్వరి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దుర్గాంబకు జ్యోతులు, బోనాలు

- 64 ఏళ్ల తరువాత జరుగుతున్న జాతర
- పాల్గొన్న ఎమ్మెల్యే పరిటాల సునీత కుటుంబం



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పరిటాల సునీత, కుటుంబ సభ్యులు

రామగిరి, మే 17(ఆంధ్రజ్యోతి): నసనకోట దుర్గాంబ జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం వెంకటాపురం, నసనకోట, గంగంపల్లి గ్రామాల ప్రజలు భక్తిశ్రద్ధలతో జ్యోతులు, బోనాలు అమ్మవారికి సమర్పించుకున్నారు. శనివారం సాయంత్రం 3 గంటలకు ముత్తవకుంట్ల గ్రామం నుంచి సరిపూటి వంశస్తులు అఖండ జ్యోతిని అమ్మవారికి తీసుకువచ్చారు. వెంకటాపురం నుంచి పరిటాల కుటుంబసభ్యులు జ్యోతులు, బోనాలతో దేవాలయానికి వచ్చారు. పరిటాలసునీత, పరిటాల శ్రీరామ్, పరిటాలసిద్దార్థతో పాటు కుటుంబసభ్యులందరూ పాల్గొన్నారు. 64 సంవత్సరాల తరువాత జరుగుతున్న జాతర కావడంతో ఆయా గ్రామాల



దుర్గాంబకు జ్యోతులను ఊరేగింపుగా తెస్తున్న పరిటాల కుటుంబికులు

ప్రజలు వారివారి బంధువులు, మిత్రులను పిలిపించడంతో మూడు గ్రామాలు కిక్కిరిసిపోయాయి. వెంకటాపురం, నసనకోట, గంగంపల్లి గ్రామాల ప్రజలు సాయంత్రం పెద్దఎత్తున జ్యోతులు, బోనాలతో అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి జ్యోతులు, బోనాలు సమర్పించిన అనంతరం రాత్రి 8గంటల తరువాత బెల్లం వంశస్తులు వండిన కుంబకూళ్లను బంగారు వంశస్తులు మోసుకుంటూ వచ్చి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు.నసనకోట పెద్దమాదిగలు బలిగంపను మోస్తూ ఊరేగింపుగా దుర్గాంబ గుడికి చేరుకున్నారు. రాత్రి 12గంటల తరువాత పెద్ద దేవర బోతును బలి ఇస్తారని, ఆ సమయంలో గ్రామాల ప్రజలు మాత్రమే ఆలయ ప్రాంగణంలో ఉండి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఉదయం అభయాంజనేయ స్వామి విగ్రహానికి 108 విశేష ద్రవ్యాలతో కలశాలతో అభిషేకం చేశారు. పంచామృతాభిషేకం, పంచసూక్తఅభిషేకం, శతచిద్రఅభిషేకం తదితర కార్యక్రమాలతోపాటు పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుదాం: సీఎఫ్



రేంజర్ కార్యాలయం ముందు సిబ్బందితో సీఎఫ్, డీఎఫ్ఓ

అనంతపురం న్యూటౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుదామని సీఎఫ్ (కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) యశోదాబాయి అన్నారు. శనివారం జిల్లా అటవీశాఖ కార్యాలయ సమీపంలోని ఉన్న రేంజర్ కార్యాలయంతో పాటు బీట్ ఆఫీసర్ బంగ్లా మరమ్మతుల అనంతరం ప్రారంభోత్సవ కార్యక్రమం చేపట్టారు. రేంజర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా సీఎఫ్, జిల్లా అటవీ శాఖాధికారి విఘ్నేష్ హాజరయ్యారు. అనంతరం కార్యాలయ ఆవరణంలో మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ కేవలం 5 నెలల క్రితం ఇక్కడ అపరిశుభ్రత తాండవంగా ఇక్కడికి రావడానికే ఇబ్బందికర పరిస్థితులు ఉండేవన్నారు. అలాంటిది డీఎఫ్ఓ సూచనల మేరకు సిబ్బంది తగిన చర్యలు చేపట్టడం ద్వారా అపరిశుభ్రతను తరిమికొట్టి ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పగలిగామన్నారు. ఇందులో భాగస్వామ్యులైన సిబ్బందిని అభినందించారు. రేంజర్ శ్రీనివాసులు, సోషల్ ఫారెస్ట్ ఇన్‌చార్జి రేంజర్ దీప, సూపరింటెండెంట్ రమేష్, సెక్షన్ ఆఫీసర్స్ అక్బర్, ప్రవీణ్‌కుమార్, మల్లికార్జున, బీట్ ఆఫీసర్స్ మారెప్ప, జగదీష్, తేజేశ్వర్‌రెడ్డి, రవిచంద్రారెడ్డి, నీలవేణి, ఏబీఓలు గిరీష్, రామ్మోహన్ పాల్గొన్నారు.

కక్షసాధింపులకు మూల్యం తప్పదు

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



అనంతపురం క్రైం, మే 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న కక్షసాధింపు రాజకీయాలకు భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంకటరామిరెడ్డి హెచ్చరించారు. శనివారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదవుతోందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేక చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చాక రాజకీయ నాయకులపైనే కాకుండా ఐఏఎస్, ఐపీఎస్‌లపై అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. గతంలో స్కిల్ స్కాంలో చంద్రబాబును సాక్ష్యాధారాలతో అరెస్ట్ చేశారని, ఇప్పుడు ఏదోవిధంగా జగన్‌పై తప్పుడు కేసులు పెట్టాలని చూస్తున్నారన్నారు. మద్యం స్కాం అనేది ఈ కూటమి ప్రభుత్వంలోనే జరుగుతోందన్నారు. ఏ షాప్‌లో చూసినా అధిక రేట్లకు మద్యం అమ్ముతున్నారన్నారు. అక్రమ కేసులు, అరెస్టులు చేసినా ఎవరూ భయపడే ప్రసక్తే లేదన్నారు. ఇప్పటికైనా కక్షసాధింపు రాజకీయాలకు స్వస్తిపలికి ఇచ్చిన హామీల అమలుపై దృష్టిపెట్టాలని సూచించారు.

చంద్రబాబును కలిసిన ప్రభాకర్ చౌదరి



చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న వైకుంఠం ప్రభాకర్ చౌదరి

అనంతపురం అర్బన్, మే 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా పాణ్యం నియోజకవర్గంలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం, పీ-4 మార్గదర్శి - బంగారు కుటుంబం కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన సీఎం చంద్రబాబును టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం ఓర్వకల్లు విమానాశ్రయంలో సీఎం చంద్రబాబును ఆయన కలిసి స్వాగతం పలికారు.

మార్కెట్‌లోకి కియ కారెన్స్ క్లావిస్ విడుదల



కియా కారెన్స్ క్లావిస్ కారును ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

అనంతపురం రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): కియ కారెన్స్ క్లావిస్ కారు మార్కెట్‌లోకి విడుదల అయింది. శనివారం హైదరబాదు-బెంగళూరు హైవేలోని ఎం.జి. బ్రదర్స్ షోరూంలో సీఈఓ ఆదిత్యమాచాని, జనరల్ మేనేజర్ ఎల్లప్ప, సేల్స్ జనరల్ మేనేజర్ గిరిప్రసాద్, సేల్ మేనేజర్ రామాంజనేయులు కారు ఆవిష్కరించారు. కస్టమర్ల చేతుల మీదుగా కారును మార్కెట్‌లోకి విడుదల చేయించారు. సీఈఓ మాట్లాడుతూ క్లావిస్‌లో బోల్డ్ డిజైన్, అద్వితీయమైన సౌకర్యం, సౌలభ్యంతో కూడినదన్నారు. డిజైన్ పరంగా స్మార్ట్ ఫ్యామిలీ కారన్నారు. హుందాగా, మంచి ఎక్స్‌టీరియర్స్‌తో, సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఆడాస్‌లెవెల్-2 అడ్వాన్స్ ప్రొటెక్షన్‌తో అద్భుతమైన డ్రైవింగ్ అనుభవాన్ని పొందవచ్చన్నారు.

కొవ్వొత్తులతో నిరసన

అనంతపురం రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను వెంటనే రెన్యువల్ చేయాలని మండలంలోని సోములదొడ్డి ఆర్డీటీ స్కూల్‌లో కొవ్వొత్తులతో శనివారం నిరసన తెలిపారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంత్రి సుదర్శన మాట్లాడుతూ ఆర్డీటీ ద్వారా ఎంతోమంది వెనుకబడిన తరగతుల విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకున్నారన్నారు. బడుగు, బలహీన వర్గాలకు ఆర్డీటీ సంస్థ ఆదుకుందన్నారు. గ్రామస్థులు సాయికుమార్, బాలకృష్ణ, రామాంజి, వీర, రామకొండ ఎర్రిస్వామి, రామ్మోహన్, పెద్దన్న, సుబ్బన్న, రామాంజనేయులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

అనంతపురం విద్య, మే 17(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ కార్యాలయంలో వచ్చే నెల 8న జరిగే భవన నిర్మాణ కార్మిక సంఘం 5వ జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం బోర్డును నిర్వీర్యం చేసిందన్నారు. రూ.4,293 కోట్లను ప్రభుత్వ పథకాలకు మళ్లించారంటూ మండిపడ్డారు. కార్మికులకు రావాల్సిన బకాయిలు 56 వేల క్లైమ్స్ బకాయిలు ఉన్నాయంటూ అసహనం వ్యక్తంచేశారు. కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించాయన్నారు. 50 ఏళ్లు పూర్తయిన కార్మికులకు పెన్షన్ ఇవ్వాలని కోరారు. జూన్ 8న అనంతపురంలో జరిగే 5వ జిల్లా మహాసభలకు కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, నగర ప్రధానకార్యదర్శి కృష్ణుడు, రామకృష్ణ, రామాంజి, లక్ష్మన్న, శ్రీరాములు, శ్రీరామ్, ఉలిగప్ప పాల్గొన్నారు.

వైద్య కళాశాలలో బీట్ ద హీట్

అనంతపురం టౌన్, మే 17(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మెడికల్‌కాలేజ్‌లో బీట్ ద హీట్ కార్యక్రమం నిర్వహించారు. మెడికోల ఎన్ఎస్ఎస్‌యూనిట్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు, పలువురు వైద్యులు పాల్గొని మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వాతావరణంలో వేడిని తగ్గించడంలో మొక్కలు ప్రధానపాత్ర పోషిస్తాయన్నారు. వైస్‌ప్రిన్సిపాల్ డాక్టరు మధుసూదన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టరు పరదేశీనాయుడు, మెడికోలు పాల్గొన్నారు.

నేడు క్యాండిల్ ర్యాలీ

అనంతపురం టౌన్, మే17 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్షను పారదోలి, వారికి అండగా నిలవాలని అంతర్జాతీయ క్యాండిల్‌లైట్ మెమోరియల్ డే సందర్భంగా ఆదివారం రాత్రి క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీ దేవి, ఎయిడ్స్ నివారణ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టరు అనుపమ జేమ్స్ తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, అనధికారులు పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఆర్డీటీని కాపాడండి

అనంతపురం సెంట్రల్, మే 17(ఆంధ్రజ్యోతి): సార్.. కరువునేలలో కులమతాలకు అతీతంగా లక్షలాది మంది పేదల బతుకులు మార్చిన ఆర్డీటీని కాపాడాలని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను కోరినట్లు ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి తెలిపారు. శనివారం జేఎన్టీయూ స్నాతకోత్సవానికి వచ్చిన గవర్నర్‌ను కలెక్టర్ వినోద్ కుమార్‌తో కలిసి రోడ్లు, భవనాల అతిథిగృహంలో వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం సాకేహరి మాట్లాడుతూ ఆర్డీటీపై అసత్య ప్రచారాలు చేస్తూ పేదలకు దూరంచేసే కుట్రలు జరుగుతున్నాయన్నారు. ఆర్డీటీ సేవల అవసరాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్తానని గవర్నర్ హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

వైఎస్సార్ కాలనీ పరిశీలన

అనంతపురం రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుగుంట గ్రామం వైఎస్సార్ కాలనీని తహసీల్దార్ మోహన్‌కుమార్ పరిశీలించారు. శనివారం వర్షం నీరు వెళ్లేదెలా..? అన్న శీర్షిక ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆయన కాలనీని సందర్శించి ప్రజలతో మాట్లాడుతూ సమస్యపై ఆరా తీశారు. వర్షపు నీరు వెళ్లేందుకు వీలు లేకుండా ప్రహరీ నిర్మించిన వారిని పిలిపించి మాట్లాడారు. వర్షపు నీరు సవ్యంగా వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీఆర్వో రామకృష్ణ, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు నారాయణ స్వామి పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతోనే స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర

అనంతపురం రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): అందరి భాగస్వామ్యంతోనే స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర సాధ్యమని విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రిశేఖర్ అన్నారు. శనివారం జేఎన్‌టీయూ రోడ్డులోని విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయం, పాతవూరు పవర్ ఆఫీస్ ఆవరణలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎస్ఈ కార్యాలయం, పవర్ ఆఫీస్ ఆవరణలో అపరిశుభ్రతను తొలగించారు. టెక్నికల్ ఈఈ ప్రసాద్, ట్రాన్స్‌ఫార్మర్ ఈఈ రవిశంకర్, ఏఓ రాజశేఖర్ పాల్గొన్నారు.

గార్లదిన్నె: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఎంపీడీఓ యోగానందరెడ్డి అన్నారు. శనివారం గార్లదిన్నెలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డంపింగ్ యార్డు వద్ద మొక్కలు నాటారు. ఈఓఆర్డీ దామోదరమ్మ, ఏపీఎం మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి పాల్గొన్నారు.

నార్పల: వేడి తాపం తగ్గించడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బొందలవాడ ఉప సర్పంచ్ ఆలం వెంకట నరసానాయుడు అన్నారు. నార్పల మండలం బొందలవాడ గ్రామంలో శనివారం సర్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మే నెలలో బీట్ ద హిట్ కార్యక్రమంలో భాగంగా ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లో మొక్కలు నాటారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు



ప్రతిజ్ఞచేస్తున్న విద్యుత్ శాఖ ఎస్ఈ, అధికారులు, ఉద్యోగులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి చిత్రంలో ఎంపీ అంబికా, తదితరులు

మన ఇంటి నుంచే పరిశుభ్రత ప్రారంభం కావాలి

- ఎంపీ అంబికా, ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురంరూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): పరిశుభ్రత అన్నది మన ఇంటి నుంచే ప్రారంభం కావాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని ఎ.నారాయణపురం పంచాయతీ స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీ, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. వారు అధికారులు, పార్టీనాయకులతో కలసి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మొక్కలు నాట్టారు. వారు మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమంలో జిల్లాను మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రతి కృషి అవసరమన్నారు. తమ ప్రాంతాల్లో పశువులకు, పక్షులకు మంచి నీటిని అందుబాటులోకి ఉంచాలన్నారు. గ్రామాల్లో చెట్లను విరివిరిగా పెంచాలన్నారు. నియోజకవర్గంలో గడిచిన పది నెలల్లో రూ.35కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించామన్నారు. ఈ ఏడాదిలో రూ.100కోట్లతో అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ వెంకటనాయుడు, పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ సురేష్, కార్యదర్శి ప్రవీణ్‌బాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళీ, జిల్లా ఉపాధ్యక్షుడు డిష్ నాగరాజు, మాజీ ఉపసర్పంచు ఓబుళపతి, రఘునాథ్, మాధవి, అశ్విని, పరమేశ్వర్, సైఫుద్దీన్ పాల్గొన్నారు.

గవర్నర్‌కు ఘన వీడ్కోలు



రాష్ట్ర గవర్నర్‌కు వీడ్కోలు పలికిన మంత్రి సవిత, ఎమ్మెల్యేలు, కలెక్టర్

అనంతపురం అర్బన్, మే 17 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ స్నాతకోత్సవానికి హాజరయ్యేందుకు జిల్లాకు వచ్చిన గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు పలువురు ప్రముఖులు ఘనంగా వీడ్కోలు పలికారు. శనివారం సాయంత్రం స్థానిక ఆర్‌ అండ్‌బీ అతిథి గృహంలో మంత్రి సవిత, కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఎంఎస్ రాజు, బండారు శ్రావణిశ్రీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, జేసీ శివనారాయణ్ శర్మ గవర్నర్‌కు వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.

గవర్నర్ నజీర్‌కు ఎంపీ అంబికా స్వాగతం



గవర్నర్‌కు బొకే అందిస్తున్న ఎంపీ

అనంతపురం అర్బన్ మే 17 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఘనంగా స్వాగతం పలికారు. శనివారం జేఎన్‌టీయూ స్నాతకోత్సవానికి హాజరయ్యేందుకు జిల్లాకు వచ్చిన గవర్నర్‌ను స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఎంపీ కలిసి అందించారు. జిల్లా అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

వధూవరులను ఆశీర్వదించిన గవర్నర్



వధూవరులు, అమిలినేని, ముత్తినేని కుటుంబ సభ్యులతో గవర్నర్ అబ్దుల్ నజీర్

అనంతపురం అర్బన్, మే 17(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఇంటికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ వెళ్లారు. శనివారం సాయంత్రం ఆయన అమిలినేని ఇంటికి వెళ్లి నూతన వధూవరులు శ్రీచరిత, రాహుల్ ఆదిత్యాలను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు గవర్నర్‌కు ఎమ్మెల్యేతోపాటు ఆయన వియ్యంకుడు ముత్తినేని రాజగోపాల్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయండి



గవర్నర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎల్లన్న

అనంతపురంరూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూనివర్సిటీలో 2018లో నోటిఫికేషన్ ఇచ్చిన ఎస్సీ ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఎల్లన్న కోరారు. ఈ మేరకు ఆర్అండ్‌బీఅతిథి గృహంలో గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ఆయన కలసి వినతి పత్రం ఇచ్చారు. మాదిగ విద్యార్థి రాష్ట్ర నాయకులు నాగేష్, టీచర్ మూడిద నాగేంద్ర, రామాంజనేయులు పాల్గొన్నారు.

డబ్బు పోగొట్టుకున్న వ్యక్తికి తిరిగి ఇచ్చిన యువకులు

నార్పల, మే 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన కృష్ణమూర్తి మద్యం దుకాణంలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి దుకాణం మూసివేసి కలెక్షన్ తీసుకొని వెళ్తుండగా రోడ్డులో డబ్బులు పడిపోయాయి. ఆ డబ్బులను వెనకవైపు ద్విచక్రవాహనంలో వస్తున్న జాకీర్, కాశీం అనే యువకులకు దొరికాయి. డబ్బులు పోగొట్టుకున్న వ్యక్తులు వస్తే తిరిగి ఇస్తామని తమ వద్ద ఉంచుకున్నారు. డబ్బులు పోగొట్టుకున్న కృష్ణమూర్తి నార్పల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రోడ్డులో డబ్బులు పోయాయి ఎవరికైనా దొరికాయా అని కానిస్టేబుల్ అమర్ విచారిస్తుండగా జాకీర్,కాశీం అనే యువకులు రాత్రి తమకు రూ.24వేలు దొరికాయన్నారు. పోలీసుల సమక్షంలో కృష్ణమూర్తికి ఆ సొమ్మును యువకులు అందజేశారు.

దొరికిన బంగారు నెక్లెస్ పోలీసులకు అప్పగింత

అనంతపురం క్రైం, మే 17(ఆంధ్రజ్యోతి): నగరంలో ఎవరో బంగారు నెక్లెస్‌ను పోగొట్టుకున్నారు. శనివారం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీనివాసనగర్ ఆటో స్టాండ్‌లో పడి ఉన్న నెక్లెస్‌ను స్థానిక ఆటో డ్రైవర్లకు దొరికింది. వారు స్థానిక టీడీపీ నాయకుడు రఘుతో కలిసి త్రీటౌన్ సీఐ శాంతిలాల్‌కు అందజేశారు. సీఐ ఆటో కార్మికుల నిజాయితీని అభినందించారు. ఎవరైనా ఆధారాలతో వస్తే వారికి ఆ నెక్లెస్ అందజేస్తామన్నారు.

చికిత్స పొందుతూ ప్రైవేట్ లెక్చరర్ మృతి

అనంతపురం క్రైం, 17(ఆంధ్రజ్యోతి): నగరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ ప్రైవేట్ లెక్చరర్ మృతి చెందాడు. నగరంలోని ఏడీసీసీ బ్యాంకు కాలనీకి చెందిన అమీర్‌బాషా(66) ఎస్ఆర్‌కే కళాశాలలో ప్రైవేట్ లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 13వ తేదీ భార్యతో కలిసి బైక్‌లో వెళ్తుండగా ప్రభుత్వాసుపత్రి ఎదుట బైక్ ఢీ కొంది. ఈ ఘటనలో గాయపడిన అమీర్‌బాషాను ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హిమోఫీలియా మందుల పంపిణీ

అనంతపురం సెంట్రల్, మే 17(ఆంధ్రజ్యోతి): హిమోఫీలియా బాధితులకు శనివారం ఉచితంగా మందులు పంపిణీచేశారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని ధన్వంతరి హాల్లో ఐఎన్‌టీఏఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాదాపు 150మందికి అందజేసినట్లు సంస్థ ప్రతినిధులు సుజాత, క్రిష్ణారావు పేర్కొన్నారు. సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావును డాక్టర్ సుమలతతో కలిసి సన్మానించారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కేశవ్

ఉరవకొండ, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లో శనివారం బీట్ ద హీట్ అనే కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుతం వేసవి కనుక ప్రజలు వడదెబ్బ గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇందుకు అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా ఉపాధి కూలీల పట్ల జాగ్రత్తలు వహించాలన్నారు. చలివేంద్రాలను విరివిగా ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఎంపీడీఓ రవిప్రసాద్, టీడీపీ మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్, టీడీపీ నాయకులు చలపతి, నరేష్ పాల్గొన్నారు.

బెళుగుప్ప : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్ షర్మిల ప్రారంభించారు. వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే ప్రజలు దీనిని వినియోగించుకోవాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ సురేఖ, ఆర్ఐ రమాదేవి, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

రూ. 3.06 లక్షల విలువైన మద్యం ధ్వంసం

బొమ్మనహాళ్, మే 17(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం సర్కిల్ పరిధిలో గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పట్టుబడిన మద్యం బాటిళ్లను శనివారం పోలీసులు ధ్వంసం చేశారు. అక్రమంగా కర్ణాటక నుంచి రవాణా చేసి నిల్వ ఉంచిన మద్యాన్ని ఎన్నికల సందర్భంగా పోలీసులు తనిఖీలు చేసి పట్టుకున్నారు. బొమ్మనహాళ్, కణేకల్లు, గుమ్మగట్ట, డీ. హీరేహాళ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో అక్రమంగా పట్టుబడిన రూ. 3.06 లక్షలు విలువ చేసే మద్యంను మండల కేంద్రంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రేవతి, రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ సమక్షంలో ఎస్ఐలు నబీరసూల్, గురుప్రసాద్‌రెడ్డి ధ్వంసం చేశారు. 56 కేసుల్లో పట్టుబడిన 666 లీటర్ల మద్యంను రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు.

పాము కాటుతో టీడీపీ నాయకుడి మృతి


నరసింహారెడ్డి (ఫైల్)

గుత్తి రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి):మండలంలోని బ్రహ్మణపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు నరసింహారెడ్డి (48) శనివారం పాము కాటుతో మృతి చెందారు. నరసింహారెడ్డి ఉదయం బహిర్భూమికి గ్రామశివారులోని చెరువు కట్టపైకి వెళ్తుండగా అక్కడ పాము కాటు వేసింది. వెంటనే ఇంటికి వచ్చి విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపారు. వారు గుత్తి ఆసుపత్రికి తరలించారని, తర్వాత మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందారు. ప్రస్తుతం నరసింహారెడ్డి మాముడూరు సాగునీటి సంఘం ఉపాధ్యక్షుడుగా ఉన్నారు. స్థానిక టీడీపీ నాయకులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

విద్యుత్‌షాక్‌తో రైతు..


శివశంకర్‌రెడ్డి (ఫైల్)

పెద్దవడుగూరు, మే 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావులుడికి గ్రామంలో శనివారం విద్యుదాఘాతంతో శివశంకర్‌రెడ్డి (58) అనే రైతు మృతిచెందాడు. మృతుడి భార్య భూలక్ష్మి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. శివశంకర్‌రెడ్డి తన పొలంలో వేరుశనగ పంటకు నీరుపెట్టడానికి ఉదయమే వెళ్లాడు. అక్కడ బోరుమోటార్‌కు విద్యుత్ సరఫరా కాకపోవడంతో పొలం సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫీజు వేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. అటుగా వెళుతున్న రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. విద్యుత్ సిబ్బంది అందుబాటులో లేకపోవడం వల్ల రైతులే విద్యుత్ మరమ్మతులు చేపట్టే క్రమంలో ఈ సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

డీ.హీరేహాళ్, మే 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాజరకల్లు టోల్ ప్లాజా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మల్లికేతి గ్రామానికి చెందిన రాజశేఖర్‌రెడ్డి, ఉపేందర్ రెడ్డి కలిసి శనివారం ఉదయం ద్విచక్ర వాహనంపై పని నిమిత్తం కర్ణాటక లోని రాంపురానికి బయలుదేరారు. అక్కడ పని ముగించుకుని మధ్యాహ్నా సమయంలో తిరిగి స్వగ్రామానికి వస్తుండగా.. జాజరకల్లు టోల్‌ప్లాజా వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో ఆ ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వారిద్దరినీ చికిత్స నిమిత్తం బళ్లారి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాజశేఖర్‌రెడ్డి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

టీడీపీ కార్యకర్త మృతికి నివాళి

పామిడి, మే 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నాలుగో వార్డు మాల వీధికి చెందిన టీడీపీ కార్యకర్త లాలాల సూర్యనారాయణ(55) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ నాయకులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అలాగే కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి, మాజీ కౌన్సిలర్ చెన్నవరం మహబూబ్ బాషా, విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షుడు అప్పన్నగారి కుమార్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మా మోహన్‌కృష్ణ, పలువురు నాయకులు ఉన్నారు.

బూటకపు కేసులు పెడుతున్నారు: వైసీపీ

గుంతకల్లు, మే 17(ఆంధ్రజ్యోతి): తమ పార్టీ నాయకులపై అధికార పార్టీ వారు బూటకపు కేసులు పెడుతున్నారని, తమ హయాంలో వచ్చిన ప్రాజెక్టులను తామే సాధించామంటూ శంకుస్థాపనలు చేస్తున్నారంటూ వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జి వై .వెంకట రామిరెడ్డి ఆరోపించారు. పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లిక్కర్ కేసుల్లో తమ పార్టీకి చెందిన కృష్ణ మోహన్‌రెడ్డి, బాల గోవిందప్ప, ధనుంజయరెడ్డి పేర్లను ఇరికించి విచారణ చేస్తున్నారని, ప్రతిపక్షం నోరు నొక్కేసేందుకే చట్టాన్ని వాడుకుంటున్నారని ఆరోపించారు. గుత్తి మండలంలో శంకుస్థాపన చేసిన రెన్యూ సోలార్ విద్యుత్ ప్రాజెక్టును వైసీపీ హయాంలో తెచ్చామని, భూసేకరణ కూడా చేశామని తెలిపారు. కొన్ని కారణాల వల్ల సకాలంలో ప్రారంభించలేదన్నారు. దాన్ని ప్రస్తుత ప్రభుత్వం తన ఖాతాలో వేసుకుందని ఆరోపించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో తగిన సమాధానమిస్తారని తెలిపారు. సమావేశంలో నాయకులు జింకల రామాంజనేయులు, ఎన్ భీమలింగప్ప, నూర్ నిజామి, ఖలీల్, బీ రాము, లింగన్న, తిమ్మప్ప, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

● స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో వక్తలు


శెట్టూరులో రోడ్డుపై గుంతను పూడ్చివేయిస్తున్న అధికారులు, నాయకులు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: పరిశుభ్రతతోనే ఆరోగ్యం సిద్ధిస్తుందని వక్తలు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లోని అన్ని మున్సిపాలిటీల్లో, మండలకేంద్రాల్లో శనివారం పెద్దఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, పోలీసులు, ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, ప్రజలు కలిసి వచ్చి పరిశుభ్రతపై అవగాహనా ర్యాలీలు నిర్వహించారు. అలాగే అందరం వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేశారు. తర్వాత పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు మాట్లాడుతూ పరిశుభ్రతతోనే ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. పట్టణాలను, గ్రామాలను క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచాలని కోరారు. అలాగే బీట్ ది హీట్‌పై అవగాహన కల్పిస్తూ.. ప్రస్తుతం వేసవి అయినందన ఎండవేడికి గురికాకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం అందరూ వీధుల్లో, కార్యాలయాల ప్రాంగణాల్లో చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు.


గుంతకల్లులో ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది


బెళుగుప్పలో పరిసరాలను శుభ్రం చేస్తున్న టీడీపీ నాయకులు, పోలీసులు


బొమ్మనహాళ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు , ప్రజలు

అక్రమ కేసుల నుంచి కాపాడాలని వినతి

యాడికి, మే 17(ఆంధ్రజ్యోతి): అక్రమకేసుల బారి నుంచి టీడీపీ కార్యకర్తలను, నాయకులను కాపాడాలని కోరుతూ రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు ఆ పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ చరణ్‌కుమార్ శనివారం తెలిపారు. గత గురువారం గుత్తి పర్యటనకు వచ్చిన లోకేశ్‌ను కలిసి మాట్లాడామన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై లెక్కలేనన్ని అక్రమ కేసులు బనాయించారని, టీడీపీ అభివృద్ధి కోసం నిస్వార్థంగా పనిచేస్తున్న తనపై కూడా 17 అక్రమకేసులు బనాయించడంతోపాటు రౌడీషీట్ ఓపెన్ చేశారని, వెంటనే వాటిని తొలగింపజేయాలని కోరామన్నారు. అక్రమకేసులను తొలగించేలా రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు చేపడుతుందని మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులకు కిట్ మంజూరు చేయండి

గుంతకల్లుటౌన్:రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పట్టణంలోని రైల్వే ఇంగ్లిష్ మీడియం స్కూల్, సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు విద్యార్థి మిత్ర కిట్ మంజూరు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను గత శుక్రవారం గుత్తిలో కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఉపాధ్యాయ సంఘం నాయకుడు మాధవరావు, ఉపాధ్యాయుడు శేఖర్‌బాబు శనివారం తెలిపారు. ఎమ్మెల్సీ భూమిరెడ్డిరాంగోపాల్ రెడ్డి ద్వారా ఈవినతిని అందించినట్లు చెప్పారు.

5న జాతీయ లోక్ అదాలత్

గుంతకల్లుటౌన్, మే 17(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం జేఎఫ్‌సీఎం, మండల న్యాయసేవాధికార కమిటీ ఛైర్మన్ ఎం మంజుల జాతీయ లోక్ అదాలత్‌పై బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, పోలీస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూలై 5వ తేదీన పట్టణంలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు చెప్పారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను లోక్ పరిష్కరించుకోవాలన్నారు. సమావేశంలో ఏపీపీ సుహాసిని, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జయరాం, న్యాయవాదులు తిమ్మప్ప, బడేసాబ్, గోపాలకృష్ణ, భాస్కర్ గౌడ్, రజాబ్‌వలి, వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్ సీఐగా ఉమాదేవి

గుత్తి, మే 17(ఆంధ్రజ్యోతి): గుత్తి ఎక్సైజ్ సీఐగా ఉమాదేవి శనివారం స్థానిక ఎక్సైజ్ ఎక్సైజ్ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న సీఐ మోహన్‌రెడ్డి మడకశిర ఎక్సైజ్ మొబైల్ సీఐగా బదిలీ అయ్యారు. అనకాపల్లి ఎక్సైజ్ సీఐగా పనిచేస్తున్న ఉమాదేవి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఆస్లాంబేగ్ ఆమెకు స్వాగతం పలికారు.

తరగతి గదులకు విరాళం

పామిడి, మే 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సరస్వతీ విద్యా మందిరం నిట్టూరు నిలయం నూతన తరగతి గదుల నిర్మాణంకు గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే కొట్రికె మధుసూదన్‌గుప్తా, ఆయన సోదరుడు శ్రీహరిగుప్తా భారీ విరాళం అందజేశారు. నిట్టూరు నిలయం కమిటీ నూతన తరగతి గదుల నిర్మాణం దృష్ట్యా వారిని సంప్రదించడంతో సానుకూలంగా స్పందించి రూ. 5లక్షలు విరాళం అందజేసినట్లు వారు తెలిపారు. కొట్రికె సోదరులను పాఠశాల కమిటీ సత్కరించారు. ఈ విరాళంపై పాఠశాల కమిటీ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉరవకొండలో భారీ వర్షం

● పొంగి పొర్లిన వాగులు వంకలు


మరువ పారుతున్న ఉరవకొండ మండలంలోని బూదగవి చెరువు

ఉరవకొండ, మే 17(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ, వజ్రకరూరు మండలాల్లో శుక్రవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. ఉరవకొండలో 52.2 మి.మీల వర్షం పాతం నమోదైనట్లు అధికారులు శనివారం తెలిపారు. బూదగవి చెరువులోకి భారీగా వర్షం నీరు చెరడంతో మరవ పారింది. అమిద్యాల గ్రామంలో పిడుగు పడి నరసింహులు అనే రైతుకు చెందిన రెండు ఎద్దులు మృతి చెందాయి. వజ్రకరూరు మండలంలో కురిసిన వర్షానికి హంద్రీనీవా కాలువలోకి భారీగా వర్షపునీరు చేరింది. అలాగే ధర్మపురిలో పిడుగుపడి భాస్కర్‌కు చెందిన మూడు గొర్రెలు చనిపోయాయి.

● తాడిపత్రి: పట్టణంలో శనివారం సాయంత్రం గంటపాటు ఏకధాటిగా భారీ వర్షం కురిసింది. ఈ సందర్భంగా లోతట్టుప్రాంతాలు జలమయమయ్యాయి. హరిజనవాడ, కృష్ణాపురం జీరోరోడ్డు, సుంకులమ్మపాలెం, శివానగర్ తదితర లోతట్టు ప్రాంతాలు వర్షపునీటితో నిండిపోయాయి. దీంతో ఆయా కాలనీలవాసులు పలు ఇబ్బందులు పడ్డారు.

●పుట్లూరు: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. శనగలగూడూరు, తక్కళ్లపల్లి, గాండ్లపాడు, పోతిరెడ్డిపల్లి, తిమ్మాపురం తదితర గ్రామాల్లో భారీ వర్షం కురవడంతో వంకలు పొంగిపొర్లాయి.

● యల్లనూరు: మండలంలో శనివారం సాయంత్రం ఉరుములతో కూడిన వర్షం కురిసింది. జంగంపల్లి, పాతపల్లి, యల్లనూరు, కృష్ణాపురం గ్రామాల్లో పదును వర్షం కురవగా మిగిలిన గ్రామాల్లో తేలికపాటి వర్షం కురిసింది.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కణేకల్లు: మండలవ్యాప్తంగా రాబోయే రెండు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ తహసీల్దార్ విశ్వనాథ్ శనివారం ప్రకటనలో కోరారు. రైతులు, ప్రజలు పొలాలకు వెళ్లేటపుడు, కాలువలు దాటేటపుడు, విద్యుత్ పనులు చేసేటపుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సబ్సిడీపై పశువుల దాణా పంపిణీ

విడపనకల్లు, మే 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పశువైద్యశాలలో శనివారం పాడిరైతులకు 50శాతం సబ్సిడీతో పశువుల దాణాను ఉరవకొండ పశు సంవర్ధక శాఖ డీడీ వెంకటేశులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన 110 మంది రైతులకు 40 క్వింటాళ్ల దాణా పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ మండలానికి 25 మెట్రిక్ టన్నుల పశుల దాణా వచ్చిందన్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగి, పశువులున్న రైతులకు 50 శాతం సబ్సిడీతో రాష్ట్ర ప్రభుత్వం దాణా పంపిణీ చేస్తోందన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి నరేష్‌కుమార్, సర్పంచ్ చంద్రశేఖర్, టీడీపీ నాయకులు సినిమా రామాంజనేయులు, హనుమంతు, ప్రసాద్ పాల్గొన్నారు.

జనసేన కార్యకర్తల సమావేశం

ఉరవకొండ, మే 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జనసేన కార్యాలయంలో శనివారం కార్య కర్తల సమావేశం జరిగింది. ఇందులో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గౌతమ్ మాట్లాడుతూ.. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్న కార్యకర్తల శ్రేయస్సే జనసేన లక్ష్యమని పేర్కొన్నారు. కార్యకర్తల శ్రేయస్సు కోసం పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ జీవిత బీమా, ప్రమాదబీమా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనంతరం క్రియాశీలక సభ్యత్వ నమోదులో ముఖ్యపాత్ర పోషించన వలంటీర్లకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, గోపాల్, సుధీర్, దేవేంద్ర, రాజేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొళాయిల్లో కలుషిత నీటి సరఫరా

తాడిపత్రి, మే17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆసుపత్రిపాలెంలో శనివారం మంచినీటి కొళాయిల్లో కలుషిత నీరు వస్తోందని పలువురు కాలనీవాసులు వాపోయారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో కౌన్సిలర్ రేష్మాపర్వీన్, మున్సిపల్ అధికారులు కాలనీలో పర్యటించారు. పలు కొళాయిల వద్ద నీటి నమూనాలను సేకరించారు. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

కుక్కల దాడిలో 25 గొర్రెపిల్లల మృతి

పెద్దవడుగూరు, మే 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నవడుగూరు గ్రామంలో గొర్రెపిల్లల మందపై కుక్కలు దాడిచేయడంతో 25గొర్రెపిల్లలు మృత్యువాతపడ్డాయి. తనకు ఉన్న గొర్రెపిల్లలను తన ఇంటి సమీపంలో కంచె వేసి ఉంచగా కుక్కలు దాడిచేశాయన్నారు. ఈ సంఘటన వల్ల దాదాపు రూ.1.50లక్షలు నష్టం వాటిల్లిందని గొర్రెల కాపరి నాగేశ్వర వాపోయారు.

ఎక్సైజ్ ఆధ్వర్యంలో వాహనాల వేలం

బొమ్మనహాళ్, మే 17(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం సర్కిల్ పరిధిలో ఎక్సైజ్ మద్యం కేసుల్లో పట్టుబడిన వాహనాలకు శనివారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో అనంతపురం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రేవతి, రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. 31 ద్విచక్ర వాహనాలు వేలం వేయగా రూ. 3.07 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. బొమ్మనహాళ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 11 వాహనాలు, కణేకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలోని 6 వాహనాలు, గుమ్మఘట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని 14 వాహనాలను వేలం వేశామన్నారు. కార్యక్రమంలో ఆయా ఎస్ఐలు గురుప్రసాద్ రెడ్డి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

శెట్టూరు, మే 17(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం అధ్యక్షతన, అనంతపురం భూసార పరీక్ష కేంద్రం ఏఓ ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరి మాట్లాడుతూ మూడేళ్లకు ఒకసారి పొలాల్లో భూ సార పరీక్షలు తప్పక చేయించాలన్నారు. అలాగే మట్టి నమూనాలు ఏ విధంగా సేకరించాలి, ఎక్కడ సేకరించకూడదు , మట్టి నమూనాలు సేకరించే విషయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలను క్లుప్తంగా తెలిపారు. భూ సారపరీక్షలు చేయించడం వల్ల రసాయన ఎరువులపై అదనపు ఖర్చు తగ్గించవచ్చన్నారు. అలాగే ఎరువులు ఏ మోతాదులో వాడాలో, ఏ సమయంలో ఆ నేలలో ఏ పంటలు సాగు చేయాలో తెలుస్తుందన్నారు. పంటల దిగుబడి కూడా పెరుగుతాయని వివరించారు. తర్వాత అక్కడ భూ సార పరీక్షకు మట్టిని ఎలా సేకరించాలో ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. మండల వ్యవసాయ అధికారి వాసుకిరాణి, చాపిరి పీఏసీఎస్ ఇన్‌చార్జి కేసీ శ్రీనివాసులు, సీఈవో కే.చంద్రశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ కమ్మగిరి తదితరులు పాల్గొన్నారు.

పిడుగుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

బెళుగుప్ప, మే 17(ఆంధ్రజ్యోతి) : మండలంలో రెండు రోజులు వర్షాలు కురుస్తూ పిడుగులు పడే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. అప్రమత్తంగా వుండాలని తహసీల్దార్ షర్మిల ప్రజలకు శనివారం సూచించారు. వర్షం కురిసే సమయంలో అరు బయటకు వెళ్లకూడదని, చెట్ల కింద ఉండరాదని తెలిపారు.

కన్నుల పండువగా శ్రీవారి బ్రహ్మరథోత్సవం

పెద్దఎత్తున పాల్గొన్న భక్తజనం


రథోత్సవంలో పాల్గొన్న అశేష భక్తజనం

రాయదుర్గం, మే 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మరథోత్సవ వేడుక శనివారం సాయంత్రం కన్నుల పండువగా సాగింది. ఈ సందర్భంగా మొలకాల్మూరు రోడ్డులో ఉన్న ఆలయంలో అర్చకులు ఉదయాన్నే స్వామిమూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. అలాగే ఆలయ ఆవరణలో హోమాలు నిర్వహించారు. తర్వాత సాయంత్రం రథంలో భూదేవి, శ్రీదేవి సమేత స్వామివారి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి పూజలు చేశారు. అశేష భక్తజనం నడుమ సాంప్రదాయాన్ని అనుసరించి గోవిందనామస్మరణతో రథాన్ని లాగారు. మొలకాల్మూరురోడ్డు వద్ద నుంచి ప్రారంభమైన బ్రహ్మరథోత్సవం వినాయకసర్కిల్, బళ్లారిరోడ్డు, శాంతినగర్ వరకు కొనసాగింది. స్థానికులే కాకుండా కర్ణాటకలోని వివిధ ప్రాంతాల నుంచి సైతం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి రథోత్సవంలో పాల్గొన్నారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు , టీడీపీ నాయకులు హాజరై రథాన్ని లాగారు. ప్రధాన రహదారి భక్తులతో కిటకిట లాడింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా దాతలు తాగునీరు, , మజ్జిగ సరఫరా చేశారు. పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టారు.

కసాపురంలో వెండి రథ ప్రాకారోత్సవం

గుంతకల్లుటౌన్, మే 17(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం రాత్రి స్వామివారి ఉత్సవ మూర్తిని వెండి రథంలో కొలువుదీర్చి ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం అర్చకులు ఆలయంలో మూలవిరాట్‌కు వజ్రకవచం ధరింపజేసి పూజలు చేశారు. రాత్రి ఉత్సవమూర్తిని వెండి రథంలో కొలువుదీర్చి మేళతాళాల మధ్య ఆలయ ప్రాంగణంలో ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ఈఓ వాణి, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన దర్గా ఉత్సవాలు

బొమ్మనహాళ్, మే 17(ఆంధ్రజ్యోతి): కల్లుహోళ గ్రామంలో వెలసిన హజ్రత్ సయ్యద్ షహబాజ్ దివాన్ మలంగ్ దర్గా ఉరుసు ఉత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. దర్గా పీఠాధిపతులు వేకువ జామున గుర్రం షవారీని గ్రామంలో ఊరేగింపుతో దర్గాకు తీసుకొచ్చారు. ముస్లింలు, హిందువులు భారీగా దర్గా వద్దకు చేరుకుని ప్రార్థనలు నిర్వహించారు.

కెనరాబ్యాంకు వద్ద రైతుల ఆందోళన

శెట్టూరు, మే 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మంపల్లిలో గల కెనరా బ్యాంకు వద్ద రైతులు శనివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పంట రుణం కోసం బ్యాంకును ఆశ్రయించగా అధికారులు తమ భూములకు సంబంధించిన వన్‌బీ అడంగల్ పూర్తిగా సక్రమంగా ఉన్నప్పటికీ బ్యాంకు వెబ్‌సైట్‌లో సంబంధిత సమాచారం ప్రదర్శించకుండా దరఖాస్తులను తిరస్కరిస్తున్నారని, దీం తో తాము తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నామని అన్నారు. దీనిపై తహసీల్దార్ కార్యాలయం వద్దకు వెళ్లి అడిగితే వన్‌బీ అడంగల్ బ్యాంకుకు పంపిన తరువాత మాకు సంబంధం లేదంటూ అక్కడి అధికారులు జవాబిస్తున్నారన్నారు. దీంతో సమస్య ఎక్కడ ఉందో అర్థం గాక తాము ఇబ్బంది పడుతున్నట్లు వాపోయారు. రుణం లేకపోవడం వల్ల విత్తనాలు, ఎరువులు తదితర వాటి కోసం ఇబ్బందులు పడుతున్నామన్నారు. బ్యాంకు వెబ్‌సైట్‌లో వన్‌బీ అడంగల్ సమాచారం త్వరగా అప్‌డేట్ చేయాలని, తహసీల్దార్ కార్యాలయం, బ్యాంకు అధికారులు సమన్వయమై స్పష్టమైన ప్రక్రియ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా కాలవ భరత్ జన్మదిన వేడుక


భరత్‌కు కేక్‌ను తినిపిస్తున్న ప్రభుత్వ విప్ కాలవ

రాయదుర్గంరూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తనయుడు, యువనాయకుడు కాలవ భరత్ జన్మదిన వేడుకలు శనివారం పట్టణంలో ఘనంగా జరిగాయి. నియోజకవర్గం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ విప్ కాలవ వేడుకల్లో పాల్గొని భరత్‌కు కేక్ తినిపించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, మండల కన్వీనర్ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

కళ్యాణదుర్గం రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని హిందూపురం రోడ్డులో ఉన్న అక్కమాంబ ఆలయం దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. గాజులపల్లికి చెందిన రామాంజనేయులు శనివారం వ్యక్తిగత పని నిమిత్తం బైక్‌లో కళ్యాణదుర్గంకు వచ్చారు. కొద్దిసేపటి అనంతరం తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. అక్కమాంబ ఆలయం వద్దకు రాగానే ఆటో ఢీ కొట్టి వెళ్లిపోయింది. ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు టీడీపీ కార్యకర్తలకు ..

ఉరవకొండ: మండలంలోని పెన్నహోబిలం సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు టీడీపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. కూడేరు మండలానికి చెందిన మహేష్, విశ్వనాథ్ ఉరవకొండలో నిర్వహించిన మహానాడు కార్యక్రమానికి హాజరై తిరిగి స్వగ్రామానికి బైక్‌లో బయలుదేరారు. పెన్నహోబిలం సమీపంలోకి రాగానే వెనుక నుంచి బస్సు ఢీ కొంది. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మంత్రి పయ్యావుల కేశవ్ వెంటనే స్పందించి, గాయపడిన వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు.

గోల్డ్‌మెడల్ విద్యార్థులకు అభినందనలు

గుత్తి, మే 17(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు సబీయాసుల్తానా, చల్లా నాగేంద్ర అనంతపురంలోని జేఎన్‌టీయూలో శనివారం జరిగిన 14వ స్నాతకోత్సవ సభలో గోల్డ్‌మెడల్ అందుకున్నారు. ఇందుకు వారిని కళాశాలలో కరెస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, అధ్యాపకులు అభినందించారు.

విద్యుదాఘాతంతో ప్రైవేట్ లైన్‌మన్‌కు తీవ్రగాయాలు

● విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం వల్లేనంటూ గ్రామస్థుల నిరసన


రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

కళ్యాణదుర్గం రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌షాక్ తగిలి ప్రైవేట్ లైన్‌మన్ వన్నూ రప్ప తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మున్సిపాలిటీ పరిధిలోని గూబనపల్లిలో శనివారం చోటు చేసుకుంది. వన్నూరప్ప, విద్యుత్ శాఖ లైన్‌మెన్ కలిసి విద్యుత్ మరమ్మతులు చేయడం కోసం రెండు ఎల్‌సీలు తీసుకున్నారు. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేస్తుండగా ఒక ఎల్‌సీ ఆన్ చేయడంతో విద్యుత్ సరఫరా అయి షాక్ కొట్టడంతో వన్నూరప్ప కిందకు పడి రెండు కాళ్లు విరిగాయి. విద్యుత్ శాఖ లైన్‌మెన్ తృటిలో తప్పించుకున్నారు. వన్నూరప్పను స్థానికులు వెంటనే అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తర్వాత గూబనపల్లి గ్రామస్థులు పట్టణం లోని విద్యుత్ కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించి అధికారులకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఎల్‌సీ ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించిన అధికారిపై కఠిన చర్యలు తీసుకుని, బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సీఐ యువరాజ్ విద్యుత్ కార్యాలయం వద్దకు చేరుకుని వారితో మాట్లాడి శాంతింపజేశారు.

అసౌకర్యాన్ని కలిగిస్తే ఊరుకోం: జేసీపీఆర్


మాట్లాడుతున్న జేసీపీ ప్రభాకర్‌రెడ్డి

పెద్దవడుగూరు, మే 17(ఆంధ్రజ్యోతి): గ్యాస్ వినియోగదారులకు అసౌకర్యాన్ని కల్పిస్తే ఊరుకునేది లేదని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. మండలకేంద్రంలోని ఓ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకురాలు సరస్వతి, వినియోగదారులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్యాస్ ఏజెన్సీ నిర్వహణ బాధ్యతను సరస్వతి తన మరిది అయిన సూర్యప్రభాకర్‌రెడ్డి అలియాస్ బాబుకు కొన్నాళ్ల క్రితం అప్పజెప్పింది. ఇందుకు కొంత నగదు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే సూర్యప్రభాకర్‌రెడ్డి నగదు ఇవ్వకపోవడంతో పాటు అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నాడు. అలాగే గ్యాస్ సిలిండర్ల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తూ నిర్లక్ష్యం వహిస్తూ వినియోగదారులను కూడా ఇబ్బంది పెడుతున్నాడు. దీంతో ఏజెన్సీ బాధ్యతను తిరిగి తనకే ఇవ్వాలని సరస్వతి, ఆమె కుమారుడు కోరడంతో ఆయన తిరస్కరించడమే గాక భౌతిక దాడులకు పాల్పడ్డాడు. ఈ విషయమై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదు. దీంతో ఆమె సమస్యను జేసీ ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వచ్చి సూర్యప్రభాకర్‌రెడ్డి గత రెండునెలలుగా గ్యాస్‌సిలిండర్లను వినియోగదారులకు ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు ఏజెన్సీ నిర్వాహకురాలు అయిన సరస్వతి కుమారుడిపై దాడులు నిర్వహిస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే బుధవారంలోపు ఈ సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. లేకపోతే పోలీస్‌స్టేషన్ వద్దనే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. న్యాయం వైపు నిలబడాల్సిన పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి పనితీరు బాగాలేదని మండిపడ్డారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రజలే తిరగబడే రోజులు వస్తాయని హెచ్చరించారు. ఆయన వెంట టీడీపీ జిల్లా తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రెటరీ దివాకర్‌రెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి తదితరులు ఉన్నారు.